ప్రజాశక్తి

Vol. 3, no. 16

(Oct. 20, 1943)

బెజవాడ, 1943

Prajāśakti

Vol. 3, no. 16

(Oct. 20, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No. M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 16 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (స.) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 20-10-43

ప్రతి అంగుళం భూమిని సాగుచేయండి!

కర్నాటక కాంగ్రెస్‌నాయకుల పిలుపు

గాంధీజీ ముఖ్యశిష్యులలో ఒకరైన అప్పాసాహెబ్ ప. ర్ధన్, మరిముగ్గురు కర్నాటక్ కాంగ్రెసునాయకులు, కిలిని యీ క్రింది పిలుపు యిస్తున్నారు:

"ఈ యేడు రైతులు ఏ ఒక్క అంగుళంభూమి ఖాళీగాఉంచ కూడదు. అన్నిరకాల భూమిని సాగుచేయాలి. ఆహారంగా పనికి వచ్చే ప్రతి ప ర్థాన్ని పండించవలసియుంది. నాగలి ఉపయోగించ డానికి వీలుకానిచోట్ల తాగోలతో దున్నాలి. అన్నిరకాల కాయకూర లను పండించండి. మీ పనిముట్లను ః దుగుబాయగు రైతులకు చదులీయండి. మీలో మీకు ఉండే తగువులను మరచిపొండి. జమీం దార్లుకూడా తమ రైతులను అధికాహారోత్పత్తికి ప్రోత్సహించాలి.... రైతులు, కూలీలు, జమీందార్లు, కౌ: దార్లు—అందరు ఏకంకావాలి: ఆహారసంక్షోభం అందరినీ పీడిస్తోంది. కాబట్టి, అందరు కలిని ఎంత అధికాహారోత్పత్తి చేయగ రో అంతా చేయవలసిఉంది. మన ప్రజలు జీవించాలంటే, యిదొక్కటే మార్గం."

"నానాఅవస్థలకు లోనై పనిచేస్తున్న వాలంటీర్లకు ధన్యవాదాలు"

రాయలసీమ కరువునివారణ కమిటీ నాయకుల ప్రశంస

క్షామ పీడిత ప్రాంతాలలో (రాయలసీమ.) స్వచ్ఛంద సేవకుల అవసరం చాలా వున్నది క్షామ నివారణ కమిటీవారే ప్రతి గ్రామంలో వున్న జనంతో సంబంధం కలిగించుకొని, వారి కష్టనిష్ఠురాలను తెలిసికొనడం సాధ్యంకాదు. ఆ ప్రజల అవస్థలు ఒక్కరోజుపోయి చూసివస్తే తీరేవికావు. అక్కడుండి, వానిని తొలగించడానికి, నిజ పరిస్థితులు కమిటీకి, అందుకు సంబంధించిన అధికారులకు, తెల్పడానికి చాల అవసరముంది. క్యాంపులలోని కూలీల బాధలు తెలుసుకుంటూ, అప్పటికప్పుడు కలుగుతున్న వానిని వీలైతే అక్కడ తీరుస్తూ, చేతనైన సదుపాయాలు కల్పిస్తూ, వీలుకాని వానిని కమిటీకి తెలియజేయ గలవారు స్వచ్ఛంద సేవకులే.

ఇప్పుడు మాజిల్లాలో పనిచేస్తున్న రైతు సంఘ వాలంటీర్లు అభివందనార్హులు. వారెన్నో కష్టాలు పడవలసి వస్తున్నది. కొన్నిచోట్ల స్వంతముగా వంటకూడ చేసుకుంటూ, ఆ కూలీలతో కలసి మెలసి యుంటూ, అక్కడ జరుగుతున్న అక్రమాలను వెంటనే ఫామిను క్యాంపు చార్జి ఆఫీసరుకు తెల్పుతున్నారు. ఫామిన్ కోడ్‌లో విధించిన సదుపాయాలు వారికి పూర్తిగా అందకపోయిన తావులలో వాటినిగూర్చి అధికారులతో సంప్రదిస్తున్నారు. ఏయే చిక్కులున్నవో తెలుసుకొని, ప్రతి వారము మా కమిటీకి రిపోర్టులు పంపుతున్నారు. అధికారులకు-కూలీలకు మధ్య సామరస్యాన్ని పెంపొందిస్తున్నారు. క్షామ ప్రాంతాలలో ఏయేవస్తువులకు కష్టంగావుందో, ఏయే బాధలున్నవో కమిటీకి వెంటనే తెల్పుతున్నారు. ఆరిపోర్టులద్వారానే మాకా ప్రాంత బాధితులతో నిత్య సంబంధ మేర్పడుతున్నది. అందులో వారక్కడే కుదుర్చుకోలేని సంగతులలో మేము పై అధికారులవద్దకు వెళ్ళి తెల్పుతున్నాము. చాలవిషయాలలో సర్దిచేయగలిగాము.

పై విధంగా కొత్తచోట - అక్కడివారికే తిండిదొరకక అల్లాడేచోట- నానా అవస్థలకూ లోనై పనిచేస్తున్న స్వచ్ఛంద సేవకులను పంపిన ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారికి మా ధన్యవాదాలు.

ఆంధ్రమహాసభవారు కూడ ఈవిధంగానే పనిచేయడానికి, వాలంటియర్లను ఏర్పరచడానికి, మాజిల్లాకని వెయ్యిరూపాయలు తీసియుంచినది. త్వరలోనే వారిని జిల్లాకమిటీ నియామకం చేస్తుంది. ఆంధ్రమహాసభవారికి మేము కృతజ్ఞులము. ఆంధ్ర వైద్యమండలి కూడ కొందరి వైద్యులనుపంప వాగ్దానము చేసింది. ఎంత తొందరగా పంపితే అంత మంచిదని మనవి.

ఇంకా మాకెందరో వాలంటియర్లవసరం. క్యాంపులున్న ప్రాంతాని కొక్కరి చొప్పున కూడ ప్రతిచోట లేరు. ఇక్కడ పనిచేయ దలచుకొనువారెవరైనఖంకారాగలగితే,స్వాగతమిస్తాము. వారికి మేమేమీ ఇవ్వలేము. ఏసంస్థ ఇచ్చినా, లేక స్వంతముగా భరించుకోగలిగినాసరే. అట్టి దీక్ష, కష్టసహనము కలవారు మాకు వ్రాయమని విన్నవిస్తున్నాము.

ఇప్పటికేమో వానలు పడినది. ఇంకాపైరు రావడానికి కొన్ని నెలలు పడుతుంది. ఇంతలోనే కరవు తీరిపోలేదు. పనిచేయవలెననే వాంఛగల వారందరికీ మా ప్రార్థన యేమంటే : నానా బాధలుపడే బీదలకు తోడ్పడండి! తోడ్పడండి! తోడ్పడండి!

అనంతపూర్ జిల్లా కరువు నివారణ కమిటీ	ఎ. చిదంబరరెడ్డి, (మాజీ ఆం॥ రా॥కాంగ్రెసు కార్యవర్గసభ్యుడు) డాక్టరు సి. మహమ్మదాలీ, (జిల్లా ముస్లింలీగు కార్యదర్శి)

★

రాయలసీమ ప్రజలకు ఆంధ్రరాష్ట్రరైతుసంఘతోడ్పాటు

ఆంధ్రరాష్ట్రములో క్షామముతో బాధపడుతున్న రాయలసీమ ప్రజలకు ఎడతెగని కృషి చేసి తోడ్పడిన ప్రజాసంస్థలకు, దేశభక్తులకు మా కృతజ్ఞత! రాయలసీమ ప్రజల దురవస్థను గుర్తించి, మొదటిసారిగా అఖిలభారత కిసాన్‌సభశాఖ, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారు ఆంధ్రదేశమంతటా ప్రజలందరు రాయలసీమ క్షామప్రజలకు తోడ్పడాల్సిందిగా కోరుతూ రాయలసీమ క్షామనివారణనిధిని ప్రారంభించి కృషిగావించారు. వసూలుగావించిన ధనాన్ని, బట్టలను, ధాన్యాన్ని సక్రమంగా ఆ యా జిల్లాలలో ఏర్పడిన క్షామనివారణ కమిటీలకు పంపారు.

కేవలం పైసహాయం గావించడమే గాక, క్షామనివారణ కేంద్రాలలో ఛార్జీ ఆఫీసర్లు, మేస్త్రీలు, కోల్కార్లు చేసే అన్యాయాలను అరికట్టి, ప్రజలకు తోడ్పడేదానికి అనేకమంది వాలంటీర్లను గూడ పంపియున్నారు.

యీ వాలంటీర్లు అనేక కష్టాలకు ఓర్చుకొని, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయక మేస్త్రీలు, కోల్కార్లు,చేసేఅన్యాయాల్ని అరికట్టి క్షామప్రజలకు తోడ్పడ్డారు.

ఈ విధంగా రాయలసీమ ప్రజల క్షామ నివారణకు పూనుకుని సోదర రైతాంగం యొక్క సహకారాన్ని అందజేసిన ఆంధ్ర రాష్ట్రరైతుసంఘంవారికి, తమ సొంతజిల్లా, గ్రామ, కుటుంబాలను వదలి, తీవ్రకృషి గావించి మా రాయలసీమ ప్రజలకు తోడ్పడిన వాలంటీర్లకు మా కృతజ్ఞత.

అభివందనాలతో,

కె. చెంచురెడ్డి, బి. ఎ. బి. యల్.,
(జిల్లా కాంగ్రెసుకమిటీ మాజీకార్యదర్శి.),
కార్యదర్శి,
కర్నూలుజిల్లా ఆంధ్రమహాసభ క్షామనివారణ సంఘం, నంద్యాల.

గుంటూరు జిల్లాలో

వాలంటీర్ల ప్రజాసేవ

గుంటూరు జిల్లాలో అమ్మోనియా సల్ఫేటు ఇదివరకు బస్తా 30-0-0 అమ్మేది. గుంటూరుజిల్లా రైతుసంఘం కృషి ఫలితంగా దీని ధర బస్తా రూ. 28-0-0 కు కంట్రోలు చేయబడింది. అప్పటినుంచి దొంగవర్తకులు సరుకును దాచేయడం ప్రారంభించారు. రైతు సంఘం తన కార్యదీక్షను వదలలేదు. దాచేస్తున్న సరుకును మార్కెట్టుకు లాగడానికి నిశ్చయించింది.

బాపట్ల తాలూకా రైతుసంఘం, వాలంటీర్ల సహకారంతో చీరాలలో 14 బస్తాలు, వేటపాలెంలో 30 బస్తాలు, చినగంజాంలో 30 బస్తాలు, మరికొన్నిచోట్ల 50 చిన్నబస్తాలు, ఈ విధంగా బయటికితీసి మార్కెట్టుకు చేర్చింది.

ఆపైని 15 మంది వాలంటీర్లు గ్రామాల్లో సంచారంచేసి ఈ విజయంయొక్క ప్రాముఖ్యాన్ని, అధికాహారోత్పత్తి ఆవశ్యకతను ప్రచారంచేశారు. కూరగాయలు, తమిద పండించే బీదల లిస్టులు తయారుచేశారు. తాలూకా అసిస్టెంటు తహసీల్దారుగారి సహకారంతో, ఈలిస్టుల ప్రకారం 28 గ్రామాలలోని, 2,300 మంది బీదరైతులకు, ఒక్కొక్కరికి రూ 1-0-0 సరుకు చొప్పున పై బస్తాలను (చీరాల 14 బస్తాలు మినహా) 1-10-43 మొదలు 6-10-43 వరకు అమ్మించారు. ఈ అమ్మకం సందర్భంలో రైతు సంఘాల అవసరాన్ని గురించి చక్కని ప్రచారం జరిగింది. "త్వరగా మా ప్రాంతాలకు వచ్చి సంఘాలను స్థాపించండి బాబూ" అని వచ్చినవారు వాలంటీర్లను కోరారు.

రేపల్లె తాలూకాలోని నల్లూరుపాలెం, సింగుపాలెం, మోర్తోట, బొబ్బర్లంక, చోడాయపాలెం, తుమ్మ, మొదలయిన ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం మలేరియాజ్వరం రావటం మామూలు. ఈ మలేరియాదాడినుండి రక్షించుకోడానికి ఈ సంవత్సరం మందులు కరువయాయి. ఒక్క నల్లూరుపాలెంలో నెల 15 రోజుల్లో 30 మందికి పైగా జ్వరంవచ్చి చనిపోయారు. ఉల్లిపాలెంలో ఉన్న 35 ఇళ్ళల్లోను 45 మంది జ్వరంతో బాధపడుతున్నారు. ఎన్నిసార్లు హెల్తు ఇన్‌స్పెక్టరు దగ్గరకు వెళ్ళినా మందులు లేవని జవాబు. పరిస్థితులు విషమించిపోసాగాయి. ఇది గమనించి కామ్రేడ్సు యం. వి. సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, గ్రామాల్లో సంచారంచేసి మందులకోసం గ్రామస్తులందరిచేత జిల్లా అధికారులకు మహజర్లు పంపిచారు. వెంటనే అసిస్టెంటు హెల్తాఫీసరువచ్చి గ్రామాలను పరిశీలించి, రెండుపౌన్లు సింకోనాబిళ్ళలు సప్లయిచేశారు. కామ్రేడ్సు అంతటితో ఆగక, "ప్రజా వైద్య సహాయసంస్థ" నొకటి స్థాపించి, దానిద్వారా లాహోరునుంచి 1000 క్వైనైన్ బిళ్ళలు తెప్పించి, 0-0-6 కి ఒకటి చొప్పున ప్రజలకు అందజేస్తున్నారు. ఇది చూచి హెల్తు ఇన్‌స్పెక్టరు ఉచితంగా పంచడానికి 700 బిళ్ళలు కామ్రేడ్సుకిచ్చారు. ఈ విధంగా 500 మందికి మందులు అందాయి. మలేరియాఅంటే ప్రజల్లో ఉండిన భయం తగ్గింది.

టెస్టుపనులు నిలిపివేశారు!

పల్నాడు తాలూకాలో దుర్గి, అడిగొప్పల, మాచర్ల, గురజాల,గ్రామాలలో టెస్టు పనులు ప్రారంభమయాయి. కాని, ఆలస్యంగాప్రారంభించుటవల్ల, వచ్చిన కొద్దిమంది కూలీలకు తక్కువకూలి యిచ్చుటవల్ల, అదైనా ప్రతిరోజు యివ్వనందువల్ల వచ్చే కొద్దిమంది కూలీలు కూడా క్రమంగా రావడం మానివేశారు. దీనిని సాకుగా తీసుకొని, పి. డబ్ల్యుడి. ఓవర్సీయరు కరువు పరిస్థితులు లేవని రిపోర్టు పంపి, టెస్టు పనులను నిల్పివేశారు. పనిచేయించు కున్న కూలీలకు డబ్బు పూర్తిగా యివ్వనిది ఈ ఓవర్సీయరుగారే కొత్తపల్లినుండి వచ్చి పనిచేసిన కూలీలకు కూలి డబ్బులు ఇంత వరకు (9-10-43) యివ్వలేదు. తాళ్ళపల్లి కూలీలలో 100 మందికి మాత్రమే యిచ్చి, మిగతా 100 మందికి ఇంకా యివ్వలేదు. ప్రభుత్వం యీ అక్రమాన్ని అరికట్టి, కూలీలకు రావలసిన కూలిని వెంటనే చెల్లించడం అవసరమని మేళ్ళ చెర్వు పద్మనాభశాస్త్రిగారు హెచ్చరిస్తున్నారు.

బుధవారం ప్రజాశక్తి 20-10-43

23 వ ఆంధ్ర మహాసభ

ఈ నెల 23, 24 తేదీలలో ఆంధ్రమహాసభ 23 వ సమావేశం బళ్లారిలో జరుగబోతూంది. దీని విషయమై కన్నడ సోదరులలో ఆందోళన బయలుదేరింది. బళ్లారి పట్టణాన్ని, జిల్లాను ఆంధ్రులు కాజేయడానికే మహాసభను బళ్లారిలో జరుపు తున్నారనీ, అందుచే సభను బహిష్కరించాలనీ ప్రచారం బయలుదేరింది. ఈ సందేహము కన్నడ సోదరులలో ఎంత హెచ్చుగా వ్యాపించివుందో తెలసికోడానికి 16 వ తేదీ హిందూ పత్రికలో కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులైన మస్తి వెంకటేశ అయ్యంగారి ప్రకటనే సాక్షి. "కన్నడ ప్రజలు అధికసంఖ్యాకులుగావున్న బళ్లారి జిల్లాను కన్నడ ప్రాంతంలోనుంచి లాక్కోడానికి ఆంధ్రమహాసభను సమావేశ పరచడంలేదని హామీయిస్తే" బళ్లారి సభను గురించి కర్నాటకులకు ఎట్టి అభ్యంతరంలేదని వారు తెలియజేశారు.

ఆంధ్ర - కర్ణాటక సరిహద్దులను గురించి రిపోర్టుచేయ కాంగ్రెస్ మహాసభచే "కేల్కార్ కమిటీ" నియమించబడింది. బళ్లారిజిల్లాను గురించి కేల్కార్ కమిటీ నిర్ణయం యీ విధంగా వుంది:— బళ్లారిజిల్లాలోని హగరీనదికి తూర్పునవున్న ఆదోని, ఆలూరు ప్రాంతాలు మాత్రమే ఆంధ్రులవనీ, బళ్లారి పట్టణముతోసహా తక్కిన జిల్లా అంతా కన్నడ ప్రాంతమని నిర్ణయించారు. నాటినుంచి యీ నిర్ణయాన్నే జాతీయవాదులంతా అనుసరించుతున్నారు. అందుచే కన్నడ సోదరులు కోరినటుల వారి అనుమానాలను తీర్చవలసిందే. బళ్లారిలో మహాసభలు జరిపే ఉద్దేశ్యం కన్నడ ప్రాంతాలను ఆంధ్రులాక్రమించడంకాదని, స్పష్టమైన హామీ యివ్వాలనే మా అభిప్రాయం.

16 వ తేదీ ఆంధ్రపత్రికలో ఆహ్వాన సంఘాధ్యక్షులైన గూడూరు తిమ్మప్ప శ్రేష్ఠిగారు "ఆంధ్రమహాసభను జరుపుటలో, కేల్కారు నిర్ణయమునకుగాని, ఆంధ్ర కర్ణాటక సరిహద్దును సవరించుటకుగాని ఉద్దేశములేదని" హామీ యిచ్చారనీ, పెక్కుమంది కన్నడ సోదరులు తమ ప్రతిఘటనను ఉపసంహరించుకొన్నారని ప్రకటించారు. ఇందుకు ఆహ్వాన సంఘంవారిని అభినందించుతున్నాము. కన్నడ సోదరులు తమ మధ్య నివసించుతున్న సోదర ఆంధ్ర ప్రజల మహాసభోత్సవాలలో పాల్గొంటారనీ, ఆంధ్ర - కర్ణాటక ప్రజలు తమ తమ జాతీయాభివృద్ధికి, ప్రత్యేక రాష్ట్రాలకొరకు జరిపే ఉద్యమాలు ఒకదానికొకటి వ్యతిరేకంగాదని ప్రపంచానికి చాటుతారని ఆశించుతున్నాము.

పైన బళ్లారి సభలయెడల కన్నడ సోదరులకున్న సందేహాలు తెలిపి, వాటి నివారణోపాయాలను సూచించాము. వీరుగాక కొందరు ఆంధ్ర ప్రముఖులే "బహిష్కరణ సమితి" అను సంస్థ నొకదానిని స్థాపించి, బళ్లారి సభలకు వ్యతిరేకంగా పనిజేస్తున్నారు. వీరికీ, పైన జెప్పిన సరిహద్దు తగాదాకు ఎట్టి సంబంధంలేదు. వీరు ప్రకటించిన కరపత్రాలను చూస్తే వీరి సంకుచితదృష్టి బయటపడుతుంది. రాయలసీమార్థికాభివృద్ధికిని, ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకును పరస్పర వైరమున్నదనుట నిర్వివాదాంశమట! అందుచే ఈ ఆంధ్రమహాసభకు తోడ్పడువారు రాయలసీమార్థికాభివృద్ధికి ద్రోహముచేసినట్లేనట. కరువుకొరకు డబ్బుప్రోగుచేసి యిచ్చితిమని తమలోని మందబుద్ధులను మోసగించ ప్రయత్నించుతున్నారట! ఈ కుట్రలకులోనై రాయలసీమలవారు తమజిల్లాల నాశనమున కియ్యకొనగూడదని వారు హెచ్చరించుతున్నారు.

ఈ "బహిష్కరణ సమితి"లో భూస్వాములు, వర్తకులు, గవర్నమెంటు ప్లీడర్లు, రావుబహదూర్లు సభ్యులు. వీరు తమ ఉద్యమానికి ఘోషణా పత్రాలుగా ప్రకటించిన కరపత్రాలలో ఎంత వెదకినా ఆంధ్రరాష్ట్రోద్యమం రాయలసీమాభివృద్ధికి ఎలా విరుద్ధమో నిరూపించలేదు దుమ్మెత్తిపోయడం మాత్రమే కనబడుతుంది. 1937 నవంబరులో ఆంధ్ర నాయకులమధ్య జరిగిన శ్రీబాగ్ ఒడంబడికలో ఆంధ్ర మహాసభ రాయలసీమ ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కృషిచేయాలని దీక్షబూనింది. నాటినుంచి ప్రతి మహాసభలోనూ తుంగభద్ర ప్రాజెక్టు ఎగైరా రాయలసీమ ఆర్థికాభివృద్ధికి అవసరమైన పనులుచేయాలని తీర్మానించబడుతూంది. ఇప్పుడు రాయలసీమ కరువునివారణకు కృషిచేస్తోంది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, తదితర ప్రజా సంస్థలు పై కోర్కెలను బలపరుస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూవున్నాయి.

ఐనప్పటికి "బహిష్కరణ సమితి"లో చేరిన పెద్దమనుష్యులు ఆంధ్రోద్యమం ఏ విధంగా రాయలసీమ అభివృద్ధికి వ్యతిరేకమని ఎంచుతున్నారో మాకు బోధపడుట లేదు. పైగా మద్రాసుతో ముడిపెట్టుకొనివుంటే లాభమని వీరు వాదించడంలో అర్థంలేదు. గత 150 ఏండ్లుగా రాయలసీమ మద్రాస్ రాష్ట్రంలోనేవుందిగా? ఎందువలన రాయలసీమ ఆర్థికాభివృద్ధి జరుగలేదు? ఈ ప్రశ్నలకు "బహిష్కరణసమితి" వారివ్వగలిగిన సమాధాన మేమీలేదు.

నిజమేమిటంటే, ఆంధ్రోద్యమం రాయలసీమాభివృద్ధికి ఏ విధంగానూ అటంకముగాదు. ఏక జాతిగా అభివృద్ధిచెందుతున్న ఆంధ్ర ప్రజలందరూకలసి పనిజేస్తేనే రాయలసీమ ఆర్థికాభివృద్ధిని సాధించగలుగుతాము; ఆంధ్రరాష్ట్రాన్ని పొందగల్గుతాం.

రాయలసీమ ఆంధ్రోద్యమంలో చేరరాదని అచట జాతీయోద్యమ వ్యతిరేకులు వాదించుతున్నారు. ఇలాగే సర్కారులలోకూడ ప్రభుత్వాన్ని ఆశ్రయించితే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం వస్తుందనీ, ఆంధ్రులు స్వాతంత్ర్యోద్యమంలో మునిగిపోవడంవల్లనే ఆంధ్రరాష్ట్రంరాలేదని వితండవాదం చేసే కొందరు జాతీయోద్యమ వ్యతిరేకులున్నారు. వీరిద్దరిదీ సంకుచితదృష్టే. ఒకరు రాయలసీమ ఆర్థికాభివృద్ధికొరకు, మరొకరు ఆంధ్రరాష్ట్రంకొరకు బ్రిటీషు ప్రభుత్వం కనుసన్నల మెలగుదామంటారు.

వీరికి మా మనవి ఏమంటే, ప్రభుత్వం దయకోసం వేచివుంటే రాయలసీమ ఆర్థికాభివృద్ధి జరుగదు; ఆంధ్రరాష్ట్రంరాదు. అలా వస్తాయనుకోవడం పిచ్చిభ్రమ. భారత స్వాతంత్ర్యోద్యమానికీ, ఆంధ్రోద్యమానికీ వ్యతిరేకతలేదు. ప్రజలందరిని సమీకరించి కృషిచేయడంవల్లనే రాయలసీమ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది: ఆంధ్రరాష్ట్రాన్ని సాధించగల్గుతాము: భారత స్వాతంత్ర్యోద్యమం జయప్రదమవుతుంది. అందుకొరకు బళ్లారి మహాసభలు కృషిచేస్తాయనీ, ఆంధ్రప్రజల ఐకమత్యాన్ని చేకూర్చడానికి సాయపడతాయనీ ఆశించుతాము.

★ మన రాజకీయాలు

మిల్లు యజమానుల, వర్తకుల, బండారం బయట పడింది!

— కంభంపాటి సత్యనారాయణ

ఇటీవల మన దేశంలో బట్టల ధరలు విపరీతంగా పెరగడానికి కారణం, సరుకును యితర దేశాలకు పంపివేయడం, సైన్యానికి ఎక్కువ సప్లయిచేయడం, అంటూ భారత వాణిజ్యమండలివారు, మిల్లు యజమానులు, వర్తకులు వాదించారు. ఇదే "ప్రజాభిప్రాయం" అని నమ్మించడానికి దేశంలో ప్రచారం జరిగింది. కాని, బట్టల కరువుకు ప్రధాన కారణాలు యివికావనీ; దురాశాపరులగు వర్తకులు, మిల్లు యజమానులు, స్టాకుల్ని విడుదలచేయకుండా దాచియుంచడం, ప్రభుత్వం యీ నిలవ వ్యాపారాన్ని ప్రజల సహకారంతో అరికట్టలేక పోవడం, ప్రధాన కారణాలనీ, తెలియజేస్తూ వచ్చాం.

బట్టల కంట్రోలు ఆర్డరు

జూన్ నెలలో బట్టల కంట్రోల్ ఆర్డరు ప్రకటించబడింది. ఇది అమలులోకి వచ్చేలోగా వర్తకులు, మిల్లు యజమానులు, "జాగ్రత్త"పడేటందుకు సరకును మార్కెట్లోనుంచి దాచివేసి, సాధ్యమైనంత యెక్కువ సరకును అమ్మివేయసాగారు. ఇంత జరిగిన తరవాతకూడా, జులై 31 (1943) వ తేదీ నాటికి మిల్లు యజమానులవద్ద, వర్తకులవద్ద మొత్తం 270 కోట్ల గజాల బట్ట, 21½ కోట్ల పౌనుల నూలు, ఉన్నట్లు యీనెల 7 వ తేదీని టెక్స్టైల్ కమీషనర్ తెలియజేశాడు. ఇందులో దాదాపు 192 కోట్ల గజాల బట్ట వర్తకుల గిడ్డంగులలోను, 78 కోట్ల గజాలు మిల్లు గిడ్డంగులలోను, ఉన్నాయి. బట్టల కంట్రోల్ ఆర్డరుకు వ్యతిరేకంగా ఇన్ని నెలలనుండి మిల్లు యజమానులు, వర్తకులు ఎందుకు ఆందోళనచేస్తూ వచ్చారో యిప్పుడు స్పష్టంగా తేలిపోయింది.

తలకు 21 గజాల బట్ట!

ఈ సరుకు నంతటినీ మొదట్లోనే బయటికి తీసియున్నట్లయితే, 100 కి 500 వరకూ బట్టల ధర పెరిగియుండేదికాదు. కూలీ కుటుంబాలు, రైతు కుటుంబాలు, సరియైన బట్టలేకుండా కాలం గడపవలసినగతి పట్టేదికాదు. ఈయేడు మన దేశంలో ఉన్న మిల్లులన్నీ 500 కోట్ల గజాల బట్టను ఉత్పత్తిచేయగల స్థితిలో ఉన్నాయి. చేనేత మగ్గాలమీద 180 కోట్ల గజాల ఉత్పత్తికి అవకాశంఉంది. జూలై 31 వ తేదీనాటికి దేశంలో ఉన్న బట్ట దాదాపు 300 కోట్ల గజాలు. అంతకుముందు రమారమి 20 కోట్ల గజాలైనా రహస్యపు గిడ్డంగులలో దాచివేయబడి యుండాలి. అనగా, మొత్తం 1000 కోట్ల గజాల బట్ట ఈయేడు దేశంలో ఉందన్నమాట. ఇందులో యెగుమతులకు, సైన్యానికి 140 కోట్ల గజాలు పంపాలని అంచనా వేయబడింది. మిగిలిన 860 కోట్ల గజాలు ప్రజల అవసరాలకు లభించుతున్నాయన్నమాట: అంటే, తలకు 21! గజాల గుడ్డ చొప్పున దొరుకుటకవకాశం ఉంది. తక్కువ ఎగుమతులు, ఎక్కువ దిగుమతులు, ఉన్న సంవత్సరాలలో సహితం తలకు 16 లేక 17 గజాల కంటె యెక్కువ దొరకుటకు అవకాశం ఉండేది కాదు. దీని అర్థం ఏమిటి? బట్టల కరువు, విపరీత ధరలు, యుద్ధం. ఇవి ఉన్నప్పటికీ కూడా మనదేశంలో ఈయేడు యుద్ధానికి పూర్వంకంటె 100 కి 25 చొప్పున ఎక్కువ స్టాకులు ఉన్నాయన్నమాట.

కాని ధరలో?

ఇంతస్టాకు యీరోజున దేశంలో ఉన్నప్పటికీ, ధరలెలా ఉన్నాయి? 100 కి 500 చొప్పున పెరిగిన ధరల పరిమాణంలో 100కి 15 చొప్పున మాత్రమే తగ్గించబడ్డాయి. డిసెంబరు నాటికి ధరలు 100 కి 30 వంతులు మాత్రం తగ్గుతాయని టెక్స్టైల్ కమీషనర్ తెలియ జేస్తున్నాడు. కాని, యింతకంటె ఇంకా ఎంతో తగ్గించుటకు అవకాశంవుంది, ప్రభుత్వం యిందుకు పూనుకోవడంలేదు.

కారణమేమిటి? బట్టలఉత్పత్తి, పంపకం నిలవ వ్యాపారస్తుల చేతులలోనేఉంది. వాటిని ప్రభుత్వం కంట్రోల్ చేసే స్థితిలోలేదు. ఎందువల్లనంటే, ప్రజల సహకారం నిరంకుశాధికార వర్గానికి వెగటు! పేరుకు పై 280 కోట్ల గజాల బట్ట రిజిష్టరు చేయబడినప్పటికీ, కంట్రోల్ బోర్డు అంతా మిల్లు యజమానుల నిలవవ్యాపారస్తుల, చేతుల్లోఉంది. అందువల్ల కంట్రోలు అమలు జరిగేటప్పుడు లొట్టలు కనిపిస్తూనే ఉంటాయి!

ఆహారపదార్థాలపై ధరల కంట్రోల్

అన్నిఆహారపదార్థాలమీదధరల కంట్రోలు పెట్టాలని ఢిల్లీలో సమావేశమైన ఆహారసమావేశం (ప్రభుత్వ ప్రతినిధులు) తీర్మానించింది. ప్రభుత్వం నిర్ణయించబోవు గరిష్ఠ ధరలకంటె మించి యెవరూ అమ్మరాదనీ, అమ్మినవారు శిక్షార్హులనీ, తీర్మానించడం చాలవరకు దొంగ వ్యాపారస్తుల వ్యాపారాన్ని అరికట్టగలదు. ఆహార సమస్యా పరిష్కారానికి ధరల కంట్రోలుఅవసరమని చాలాకాలంనుంచిప్రజా సంస్థలు ఆందోళన చేస్తున్నాయి. ఈ ఆందోళనను ప్రభుత్వం గుర్తించినందుకు సంతసించవలసినదే. కాని, యిందులో ప్రధానమైన లోపం ఏమంటే, స్టాకుల కంట్రోలు, రవానా, పంపకం మొదలైన సమస్యలను పరిష్కరించకుండా ఊరుకున్నారు. బట్ట విషయంలో ధరలను కంట్రోలుచేయకుండా స్టాకుల్ని కంట్రోలు చేశారు; ఆహార పదార్థాల విషయంలో, స్టాకుల్ని కంట్రోలు చేయకుండా ధరలను కంట్రోలు చేయబోతున్నారు! రెండుస్కీములలోనూ నిలవవ్యాపారస్తులదే పైచేయి.

బెంగాల్‌లో ధాన్యం మాయమౌతోంది!

బెంగాల్‌లో ముస్లింలీగ్ మంత్రివర్గం ధాన్యం ధరలు, బియ్యం ధరలు, కంట్రోలు చేసింది. కాని నిలవ (మిగతా 7 వ పేజీలో)

రైతు, కూలీ సమస్యలు

ప్రజా సేవకులకు నదులు, ప్రవాహాలు అడ్డురావు!

నెల్లూరుజిల్లా, ఆత్మకూరు తాలూకాలో రైతువర్కర్లు ఒక ప్రచారకార్యక్రమం వేసుకున్నారు. నీటి వనరుల రిపేర్లు, గ్రామ తగాదాల పరిష్కారం, వగైరా సమస్యలకు పరిష్కారమార్గం చూపి, అధికాహారోత్పత్తికై రైతుల్ని ఉత్తేజపరచుటకు జి. సి. కొండయ్యగారు,అంకయ్యగారు సంచారకార్యక్రమం వేసుకున్నారు. కాని, 5 వ తేదీని బ్రహ్మాండమైనవర్షంకురిసి, నదులుపొంగి,విపరీతమైనవేగంతో ప్రవహిస్తున్నాయి. పైయిరువురు దీన్ని లెక్కజేయక,5 వ తేదీని వానిలిలో బయల్దేరి, నదులు యీదుకుంటూ రాత్రి 8 గంటలకు కుప్పురుపాడు చేరుకున్నారు. ఉదయం ఆగ్రామంలో శిధిలావస్థలో ఉన్న పంటచెరువును పరిశీలించి, చెరువుకువచ్చే వరవను బాగుచేయించుకొనేలా రైతుల్ని ప్రోత్సహించారు. గ్రామరైతుసంఘ ఎన్నికలను కూడా జరిపారు. 7 వ తేదీ రాత్రి కొండూరుపోవాలి, కాని, ప్రవాహం తగ్గలేదు. అయినా ప్రవాహాన్నియీది, కొండూరు చేరుకున్నారు. ఈ గ్రామంలో రెండు పార్టీలున్నాయి. రైతువర్కర్లు పార్టీ కక్షలవల్ల కలిగే నష్టాన్ని బోధించి, ఉభయులు కలసి పనిచేసేలాగు చేశారు. రెండు పార్టీలవారు రైతుసంఘంలో సభ్యులుగా చేరారు. కొన్ని సంవత్సరాలుగా రిపేరుకానికాలువను రైతులు తవ్వించుకొని, చెరువును నింపి, పంటల అభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ తీసుకున్నారు. 8 వ తేదీ మధ్యాహ్నం జోరువర్షంలో పెరమన గ్రామం వెళ్ళి, 50 మందిని రైతుసంఘ సభ్యులుగా చేర్చి, బెంగాల్ నిధికి సొమ్ము వసూలుచేశారు. 9 వ తేదీ ఉదయం మైలు వెడల్పున ప్రవహించే బీరాపేటి నదిని గ్రామస్థుల సహాయంతో దాటి, తమ సంచార కార్యక్రమాన్ని పూర్తిచేసుకున్నారు. అన్ని గ్రామాల సభలలోను ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమిచ్చిన ధాన్యపుధరల కంట్రోలు సూచనను బలపరుస్తూ తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

రైతులకు పశుసంపద ప్రాధాన్యత

ఆదోని తాలూకాలో (బళ్లారిజిల్లా) రామాపురం అనే గ్రామం ఉంది. అక్కడ 2 నెలల నుండి పశువులు రోగంతో విపరీతంగా చచ్చిపోతున్నాయి. గ్రామరెడ్డి పై అధికారులకు రిపోర్టు చేయక, మూకీభావం వహించాడు. పశు సంపద నశిస్తే వ్యవసాయమే క్షీణించిపోయి, ఆహార సమస్య మరీ తీవ్రరూపం దాలుస్తుందనే యదార్థాన్ని ఆ గ్రామ రైతు సంఘం గుర్తించింది. తాసిల్దారును, పశువుల డాక్టరును కదిలించి, 200 పశువులకు ఇంజక్షన్లు యిప్పించారు.

ఎరువులకు అప్పుదరఖాస్తులు

కడప చుట్టుపట్లనున్న గ్రామాలలోని రైతులు సుమారు 75 గురు నెల 15 రోజుల క్రితం ఎరువుల కొరకు అప్పుదరఖాస్తులు పెట్టారు. కాని, పైరులకు ఎరువులు వేసే కాలంమించిపోతున్నది. అందువల్ల 5-10-43 వ తేదీని 50 మంది రైతులు డిప్యూటీకలెక్టరు వద్దకు వెళ్ళిరి. జిల్లా రైతుసంఘ కార్యదర్శి ఎన్. వరదారెడ్డిగారు సకాలంలో అప్పులివ్వకపోతే అధికాహారోత్పత్తికి ఎలా నష్టమో విశదీకరించి, ఒక మెమొరాండమును యిచ్చారు. కలెక్టరు వెంటనే అప్పులులభించే యేర్పాట్లు చేస్తానని వాగ్దానం చేశాడు.

5000 బస్తాల పంటకు నష్టం

బాపట్ల తాలూకాలో నందూరు అనే గ్రామానికి మురుగు కాలువ నిమిత్తం 3 సంవత్సరాల క్రితం ప్రభుత్వం కొంతభూమిని ఎక్వైర్‌చేసింది. ఎక్వైర్ చేసిన భూమికి కాంపెన్సేషన్ కూడా యిచ్చింది. కాని, కాలువ మాత్రం ఇంతవరకు తవ్వించలేదు. దీనివల్ల 1000 యకరాలభూమి సేద్యం ఆలస్యమవుతోంది. సుమారు 600 యకరములకు మురుగు పోవు వసతి లేకుండా పోయింది. దాదాపు 15 రోజుల వరకు మురుగు నిలవ ఉండిపోతూంది. ఈవిధంగా 5000 బస్తాల పంట నష్టమవుతోంది. కాబట్టి, ప్రభుత్వం వెంటనే కాలువను తవ్వించవలసిందని శ్రీ టి. ఎస్. రామమూర్తిగారు హెచ్చరిస్తున్నారు.

తాడేరు మురుగుకాలువకు మరమ్మతు చేయించాలి

పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురం తాలూకాలో ములపర్రు గ్రామంవద్ద తాడేరు మురుగు కాలువపుట్టి, వడ్డిపర్రువద్ద నక్కల కాల్వలో కలుస్తూంది. కాని, దానికి 30 సంవత్సరాలుగా ఎన్నడూ మరమ్మతులేదు. అందువల్ల కాలువ మెరకవేసి, లంకలుపూడి, కాలువ వెడల్పు తగ్గింది. ఈ కాలువలోనే కాళింది మర్దన అనే చెత్త వేసింది. దీనికి తోడు కొడమంచిలి మురుగుకాల్వ నుండి వచ్చే మురుగు కూడా యీ కాలువలోనే కలుస్తూంది. ఈ కారణాలవల్ల అయిదారు గ్రామాలలోని 1200 యకరముల పైరుకు నష్టంవస్తోంది. అనగా 9600 మణుగుల ధాన్యం పండకుండా పోతూంది. వెంటనే ప్రభుత్వం తాడేరు మురుగు కాలువను రిపేరు చేయించి, అధికాహారోత్పత్తికి తోడ్పడవలసినదని పేటేటి వెంకటరత్నంగారు (పశ్చిమగోదావరి జిల్లా రైతుసంఘాధ్యక్షులు), ఉద్దరాజు సూరపరాజుగారు (నర్సాపురం తాలూకా రైతుసంఘాధ్యక్షులు), హెచ్చరిస్తున్నారు.

ఏలూరు తాలూకా వ్యవసాయకూలీ మహాసభ

సుమారు 1 సంవత్సరం నుండి ఏలూరు తాలూకాలో వ్యవసాయకూలీ ఉద్యమం వృద్ధిచెందుతూంది. కూలి రేటు, బంజరు భూముల సాగు, మొదలైన సమస్యల విషయంలో రైతు-కూలీ యువకులు నిరంతరకృషిచేసి, కూలీల విశ్వాసాన్ని చూరగొన్నారు. మొదట కులపెద్దలు, కొందరు స్వార్థపరులు యీ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. కాని, కూలీ సంఘ నాయకులు చూపిన అచంచల కార్యదీక్షవల్ల వ్యవసాయకూలీలు విరివిగా సంఘాలలో చేరారు.

ఈఉద్యమాభివృద్ధిని సమీక్షచేసుకుంటూ, ముందు కార్యక్రమాన్ని నిర్ణయించుటకు 9-10-43 వ తేదీని తాలూకా మహాసభ ఏలూరులో జరిగింది. 30 గ్రామాలనుంచి 40 మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. సభకు ఆర్. ఏసుపాదంగారు అధ్యక్షత వహించారు. ఈ క్రింది సమస్యలపై తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి:

1. బెంగాల్, మలబార్, రాయలసీమ ప్రాంతాల ప్రజల్ని ఆకలిబాధ నుండి రక్షించడానికి వ్యవసాయకూలీలు రైతుకూలీ సామరస్యంతో అధికాహారోత్పత్తికి నడుం బిగించాలి.

2. సాగుకు పనికివచ్చే బంజరు భూములను సాగుకు తేవాలి. కోళ్ళను, మేకలను, పందులను పెంచాలి. దొడ్లలోను — గట్లమీద కూరగాయలు పండించాలి.

3. వివిధగ్రామాలలో కూలీలు బంజరు భూమిని సాగుచేసినందుకు స్థానికాధికారులు పెనాల్టీలు విధించడం, కూలీలవద్ద లంచాలు తీసుకోవడం, మాగాణికి పనికివచ్చే భూమిని మెరకసాగుకు మాత్రమే యివ్వడం, కూలీలకిచ్చుటకు బదులు దఫేదార్లకిచ్చి సాగుకు నష్టం కలిగించడం—మొదలైన అక్రమాలను అరికట్టవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

4. బస్తా ధాన్యం ఎన్ని రూపాయలమ్మితే అన్ని అణాల చొప్పున రైతులు కూలీలకివ్వాలి.

సాయంత్రం 3 గంటలకు కొత్తగూడెం నుండి 300 మంది స్త్రీ పురుషులు ఊరేగింపుగా బయల్దేరి, కూలీసంఘ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ రంభా వెంకటప్పయ్యగారు జండాప్రతిష్ఠాపనచేశారు. సాయంత్రం హిందూ యువజనసంఘ ఆవరణలో ఏసుపాదంగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది. వి. వి. శివయ్యగారు రైతు—కూలీ సమస్యలమీద ఉపన్యసించారు.

నూతనసంవత్సరానికి కోండ్రు సుబ్బారావుగారు అధ్యక్షులుగాను, ఆర్. ఏసుపాదంగారు వుపాధ్యక్షులుగాను, ముక్కెల్లి నారాయణగారు కార్యదర్శిగాను, నేతల వెంకటేశ్వరరావుగారు సహాయకార్యదర్శిగాను, ఎన్నుకోబడ్డారు.

మరణ ఘోష!

అమెరీ లిన్లిత్గోల అమానుష ప్రతిష్టంభనం
మా ప్రాణాలతో ఆడిన చెలగాటం
ప్రపంచ ప్రజకొక కఠోరసాక్ష్యం
బంగరుసంపల భారత భువిలో
పొట్టకు పట్టెడు మెతుకే కరువై
మరణించాం! మేం మరణించాం!

అహో! మా మరణదూతలే, తిండిదొంగలు
శిశువుల రోదనలే జయభేరీగా
భార్యల మానాలే తమ పణముగ
మా ప్రాణాలే తమ అధికలాభముగ
దొంగ(ఉష్-నడి) బజారులోదోచినఫలితం
మరణించాం! మేం మరణించాం!

జానాబ్ జిన్నా! జానాబ్ జిన్నా!
కాంగ్రెసు లీగుల కలయిక కోసం
కావించిన కృషియేమో కాని!
కలకత్తాలో కాలిబాటలపై
హిందువులం-ముస్లింలం-ఒకటై—!
మరణించాం మేం మరణించాం!

దేశభక్తులారా! బహుపరాక్!
జాతి నాయకుల జైలువిముక్తికై
జాతులమధ్యను సఖ్యత గూర్చి
తిండికరువును తీర్చుటకొరకై
కృషిచేయని మీనిస్పృహఫలితం
మరణించాం మేం మరణించాం!

దేశభక్తులను వెన్నునపొడిచి
జాప్ బాంబులతో స్వేచ్ఛను దెచ్చే
పంచమాంగదళ పాపుల చర్యల
కాంగ్రెసుపేరిట చేసే మోసం!
ఘోరం! దేశద్రోహం! చాటుటకై
మరణించాం, మేం మరణించాం!

మాతృభూమి రక్షణ పోరాటంలో
వీరులవలె, మరణించే భాగ్యం
లేదని, ఆశాహృదితో, వ్యధతో,
దేశభక్తులను మేలుకొల్పుటకు—
ఆకలి! ఆకలి! అని ఘోషిస్తూ
మరణించాం, మేం మరణించాం!

—పట్టాభి రామారావు

నూతన అనుభవాలు

ఈనెల 3 వ తేదీనుండి 8 వ తేదీ వరకు కొత్తపేట (బెజవాడ) లో యువజన సంఘ వార్షికోత్సవాలు జరిగాయి. మొదటి మూడు రోజులు ఆటల పోటీలు జరిగాయి. వీటిలో 11 జట్టులు పాల్గొన్నాయి. గెలిచిన వారికి బహుమానాలిచ్చారు. 4 నుండి 8 వ తేదీ వరకు సంఘ కార్యాలయం ముందు ప్రతి రాత్రి విచిత్రవేషాలు, 'సంఘబలం' 'గెరిల్లా' అను నాటకాలు, బాబూరావు, స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం అనే బుర్రకథలు, అన్నాచెల్లెలు సంవాదం ప్రదర్శించబడ్డాయి. ఈ ప్రదర్శనాలలో పాల్గొన్నవారికి కూడా బహుమానాలిచ్చారు. మొత్తం 7½ వేల మంది ప్రజలీ ప్రదర్శనాలుచూచి, వాటి సందేశం విన్నారు.

దసరా ఉత్సవాల సందర్భంలో ఈవిధంగా ఆటల పోటీలు, దేశభక్తి ప్రచారం జరగడం వేలకొలది ప్రజలకు నూతన అనుభవం. ప్రతిపండుగ సందర్భంలోను ఇలా జరుగుతూంటే ఎంతో ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం అందరూ తెలిపారు.

వార్షికోత్సవ మహాసభకు కామ్రేడ్ తాతినేని సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించారు. కామ్రేడ్ రాజారావు మహాసభను ప్రారంభించారు.

హిందూ పండగలో ముస్లింలు పాల్గొన్నారు

నైజాంలో నల్లగొండజిల్లాలో కొలనుపేక ఒక గ్రామం. నాలుగైదు సంవత్సరాలనుండి హిందూ ముస్లిం కొట్లాటలు జరుగుతుండేవి. ఆంధ్రమహాసభ కృషి ఫలితంగా ఈ కొట్లాటలు తగ్గిపోయాయి. ఈ యేడు హిందువుల దసరా ఉత్సవాల్లో ముస్లిం సోదరులు కూడా పాల్గొన్నారు. ఈ కృషిలో స్థానిక యువకులు చాల తోడ్పడ్డారు. దసరానాడు రాత్రి సభజరిగింది. జిల్లా ఆంధ్రమహాసభ కార్యదర్శి శ్రీ రామచంద్రారెడ్డిగారు హిందూ ముస్లిం ఐక్యతను గురించి ఎంతో ఉత్తేజకరంగా ఉపన్యసించారు.

కలరా నివారణ

అనకాపల్లి తాలూకా నాగులాపల్లి గ్రామంలో గతమాసం కలరా ప్రారంభించింది: వెంటనే స్థానిక యువజన, బాల, రైతు సంఘాలవారు కమ్యూనిస్టుపార్టీవారు కలసి గ్రామాన్ని పరిశుభ్రపరచారు. హెల్తు ఇన్‌స్పెక్టరుని పిలిపించి, కలరా నివారణకు ఇంజక్షను లిప్పించారు. వీరి కృషి ప్రజాదరణను పొందుతూంది.

కుటుంబమంతా పార్టీలో కెలా వచ్చింది?

23-8-43 వ తేదీని బెజవాడ పట్టణ జనరల్‌బాడీ (కమ్యూనిస్టుపార్టీ) సమావేశం జరుగుతోంది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యాలయం పార్టీ సభ్యులతోను, సానుభూతి పరులతోను, కిటకిటలాడుతోంది. జిల్లా కమిటీ సభ్యుడు రాజకీయ రిపోర్టుపై ఉపన్యసించుతున్నాడు. ఉపన్యాసం మధ్యలో 55 సంవత్సరాల వ్యక్తి హాలులో ప్రవేశించాడు. అతని తరవాత అతనిభార్య, నలుగురు కొడుకులు, నలుగురు కోడళ్ళు, ఒక కూతురు, బావమరది, మేనల్లుడు. ఒకరి తరవాత ఒకరు వచ్చి కూర్చున్నారు.


వీరందరూ పార్టీ సభ్యులు. మొదట వచ్చిన వ్యక్తి పేరు దత్తి సింహాద్రి. వృత్తి కమ్మరం. లబ్బీపేటలో నివాసం.

వీరు సమావేశానికి తక్కిన వారికంటె ఆలస్యంగా వచ్చారేం?

కారణం లేకపోలేదు. సింహాద్రికి మూడేళ్ల మనమరాలు ఉంది. ఆ పిల్ల నీళ్ళ విరేచనాల వల్ల ఆరోజే, ఉదయం, చనిపోయింది. 8 గంటలకు పార్టీ సమావేశం ప్రారంభమవుతుంది. సింహాద్రి ఒక్క నిమిషం ఆలోచించాడు. తొందర తొందరగా శవసంస్కారం పూర్తిచేసి, రెండు బళ్ళు కట్టించుకొని, కుటుంబంతో బయల్దేరి వచ్చాడు.

* * *

ఈ ఘటనను గురించి నేను విన్నతరవాత నా ఆశ్చర్యానికి హద్దులేదు. ఇంత త్యాగశక్తి యీ కుటుంబంలో ఎక్కణ్ణించి వచ్చింది? పార్టీయెడల వీరికింత గాఢమైన ప్రేమ కలగ



దత్తి సింహాద్రి

డానికి కారణం ఏమిటి? మనమరాలు మరణించి నప్పుడు ఇంటిల్లిపాదికీ సహజంగా కలిగే దుఃఖాన్ని దిగమింగి, పార్టీ కాన్ఫరెన్సుకు వెన్వెంటనే బయల్దేరేటట్లు చేసిన శక్తి ఏది?

సింహాద్రి, సింహాద్రి కుటుంబం, పార్టీ లోకి యెలా వచ్చారో తెలుసుకుందామని లబ్బీపేట బయల్దేరాను.

అతడు తన కుటుంబంయొక్క పుట్టు పూర్వోత్తరాలు చెప్పుకొచ్చాడు. పూర్వం యితని తండ్రి, తాత బొబ్బిలికి సమీపాన ఒక గ్రామంలో వ్యవసాయంవల్ల జీవించేవారు. క్రమేణ శిస్తులభారం. ఋణభారం యెక్కువై, భూమినంతటినీ ఋణదాతలు స్వాధీనంచేసుకున్నారు. ఇక గత్యంతరం లేకయీ జిల్లాకువచ్చేసి, కమ్మరంతో పొట్ట పోసుకోవడం ప్రారంభించారు. ఇలాగే కొందరు రైతులు యితర జిల్లాలకు వెళ్ళిపోయారు. కొందరు వ్యవసాయ కూలీలుగా మారారు.

"పార్టీతో మీకు సంబంధం ఎప్పుడు కలిగింది?"

"అయిదారు నెలలనుంచి సుబ్బారావుగారు, రామయ్యగారు (పార్టీసభ్యులు), మా పేటకు వస్తున్నారు. బియ్యానికీ, ధాన్యానికీ, కరువైపోయిన రోజులలో వారు మావంటి పేదప్రజలకు సహాయంచేశారు. చౌక డిపో కొరకు ఆందోళన చేయాలని మా అందరికీ మార్గంచూపారు. సరేనన్నాం. మాపేటకు ఆహారకమిటీ ఒకటి స్థాపించుకొని, అన్ని కుటుంబాలకు ఎంతసరుకు కావాలో లెక్కలు తీసుకున్నాం. వాటి ప్రకారం చౌకధరలకు బియ్యం అమ్మించాలని ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకొచ్చాం. 3 నెలలు యిలా ఆందోళనచేసి, చివరకు నెగ్గాం. డిపో తెరవబడింది. బియ్యం మొదట శేరు 0-2-6 చొప్పున, ఇప్పుడు 0-3-3 చొప్పున (బజారు ధర 0-4-3) అమ్ముతున్నారు. రేషనింగు ప్రకారం రోజూ 20 బస్తాల వంతున మా పేటకు సప్లయి అవుతోంది. ఇందువల్ల కుటుంబ పోషణ కొంత తేలికఅయింది. ఈ విజయాన్ని స్థిరపరచుకొంటూ, కిరసనాయిలు కొరకు ఆందోళన ప్రారంభించాం. త్వరలో కిరోసిన్ డిపోకూడా తెలువబడింది. మనిషికి నెలకు అరకాయ చొప్పున పేట అంతకూ లభిస్తోంది."

"నెలకు అరకాయ ఏమిసరిపోతుం"దని ప్రశ్నించాను.

"అదివరకు ఆ అరకాయకూడా దొరికేదా, బాబూ? చాలామంది దీపంలేకుండానే, పెంచలకడ, భోజనాలు చేసేవారు. వర్తకులు డబ్బున్నవాళ్ళకు ఎక్కువ ధరలకు అమ్మేవారు. మిగతావారిపని హుళక్కి! ఇప్పుడలాకాదు. అందరికి సమానంగా కిరసనాయిలు దొరుకుతోంది.

"ఈవిజయాలన్నీ మన పార్టీ కృషిఫలితంగా, పేట ప్రజలందరి ఐకమత్యంవల్ల, సాధించాం. ఇదంతా నేను ప్రత్యక్షంగా చూస్తూ పార్టీలో చేరకుండా ఎలా ఉండగలుగుతాను? నేను, నాకుటుంబం, పార్టీ సభ్యత్వానికి దరఖాస్తు పెట్టాం. పార్టీ అంగీకరించి, తీసుకుంది."

సంతోషంతో అతని ముఖం వికసించింది. అంతకు తొలిరోజునే లబ్బీపేటలో స్టాండర్డ్ గుడ్డ డిపోకూడా ఒకటి తెరువబడినట్లు అతడు చెప్పాడు.

కమ్యూనిస్టుపార్టీ ప్రజాసామాన్యంయొక్క నిత్యజీవిత సమస్యలనుపరిష్కరించడంద్వారా ప్రజలలో ఎంతబలంగా పాతుకుపోతూందో, నేను చూచాను. సంతోషంతో ఉప్పొంగిపోతూ తిరిగి వచ్చాను.

—కంభంపాటి సత్యనారాయణ.

❖❖❖

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సర చందా	5—0—0
అర్ధ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

❖❖❖

తెనాలితాలూకా కంచర్లపాలెంగ్రామంలో ఎన్నో సంవత్సరాలనుండి జట్టీ (నాము) పద్ధతి అమలులో ఉంది. కూలీలకు గింజలు దొరకని కటికిరోజుల్లో ధనికరైతులు రు 5 లు ఇచ్చి, పంటరోజుల్లో రు 12-0-0 విలువ చేసే బస్తాధాన్యం రు. 5 లకు కొనేసేవారు. అంటే శ్రమచేసి జీవించేకొందరు వ్యవసాయ కూలీల దినభత్యాన్ని దురాశాపరులు దోచుకోవడం అన్నమాట. గ్రామరైతుసంఘం ఈదురన్యాయాన్ని అరికట్టనిశ్చయించింది. రు 600 లు ఖరీదుగల మొక్కజొన్నలను కొని, వ్యవసాయకూలీసంఘ బాధ్యతమీద కూలీలకు కుటుంబానికి 10 మానికలు చొప్పున పంచారు. అవసరమైనవారి కివ్వడంకోసం 10 బస్తాలు నిలవ వుంచారు. రైతు, వ్యవసాయకూలీ సంఘాలు కలిసి చేసిన ఈ కృషిఫలితంగా గ్రామంలో రైతుకూలీ సామరస్య మేర్పడి, అధికాహారోత్పత్తి విరివిగా సాగడానికి అవకాశా లేర్పడ్డాయి.

"వ్యవసాయకూలీలకు తక్కువ ధరకు యిస్తాము"

భట్లపెనుమర్రు (కృష్ణాజిల్లా)లో ఈ నెల 8 వ తేదీని బహిరంగసభ జరిగింది. సభకు 1500 మంది వచ్చారు. కృష్ణాజిల్లా ఆహార కమిటీ ప్రధానకార్యదర్శి శ్రీ రామినేని పిచ్చయ్యగారు ఆహార సమస్యను గురించి విపులంగా ఉపన్యసించారు. డెల్టా ప్రాంతమైన కృష్ణాజిల్లా నుంచి, కరువుతో బాధపడుతూన్న తరుగు ప్రాంతాలకు ధాన్యంపంపించాలని హెచ్చరించారు. ప్రభుత్వం ధాన్యానికిస్తున్న ధరకు, మార్కెట్టులో వ్యాపారస్తులు అమ్మే ధరకు ఎక్కువ వ్యత్యాసం ఉండడం ఎలా ప్రజలకు నష్టదాయకమో స్పష్టపరిచారు. తరువాత దివితాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి మాలెంపాటి సీతారామయ్య ఆహార సమస్య విషయంలో ప్రజల కర్తవ్యాన్ని విశదపరిచారు.

గ్రామంలోని వ్యవసాయ కూలీలకు మార్కెట్టు ధరకన్నా తక్కువధరకు వడ్డీ లేకుండా అప్పుగా ఇవ్వాలని సభలో పిలుపుయిచ్చారు. ధనిక రైతులు కొందరు ఇందు కంగీకరించారు. కరువు ప్రాంతాలకు, మార్కెటు రేటుకన్నా తక్కువ ధరకు పంపడానికి కొందరంగీకరించారు.

ఆహారసమస్య

గ్రామైక్యతకు ధనిక రైతులు తోడ్పడాలి

★

11 గ్రామాలకు రేషనింగు రద్దు

ఆహారపదార్థాల సప్లయికోసం కడప పట్టణం మీద ఆధారపడి చుట్టుపక్కల 11 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో కూడా రేషనింగు అమలులో ఉండేది. పునాసపైర్లు వచ్చాయనే కారణంతో ఈ నెల మొదటి తేదీని ఈ గ్రామాల్లో రేషనింగు రద్దుచేశారు. భూములుగాని, వ్యవసాయంగాని, లేక పూర్తిగా పట్టణంమీద ఆధారపడేవారి స్థితి విషమించింది. జిల్లా రైతుసంఘ కార్యదర్శి యన్. వరదారెడ్డిగారి నాయకత్వాన యీనెల 3 వ తేదీన 500 మంది గ్రామస్తులు డిప్యూటీ కలెక్టరు వద్దకు వెళ్ళి తమ కష్టాలను తెలుపుకున్నారు.

ఇదేవిధంగా 5 వ తేదీని కడప తాలూకా రైతుసంఘ కార్యదర్శి అంకమ్మగారి నాయకత్వాన వందమంది వ్యవసాయ కూలీలు తహసీల్దారు వద్దకు వెళ్ళారు. ఈ 600 మందిలో ఇంచుమించు సగంమంది మునులు. 15 గురు ముస్లిం స్త్రీలుకూడా ఉన్నారు.

డబ్బు ఎలాసంపాదించుకొన్నారో గింజలు కూడా అలాగే సంపాదించుకోండని డిప్యూటీ కలెక్టరు వీరికి సమాధానంచెప్పాడు. ప్రతి గ్రామం నుంచి కొంతడబ్బు తెచ్చుకుంటే ఉన్నంత వరకు జొన్నలు, రాగులు మొదలైనవి గ్రామాలకు సప్లయి చేస్తానని తహసీల్దారు అన్నాడు.

పునాసపైరు వచ్చినంత మాత్రాన రేషనింగు రద్దుచేయడంలో అర్థంలేదు. పంటలు వచ్చినా ప్రజలందరికి సక్రమంగా సరుకు సప్లయి కావాలంటే రేషనింగు అవసరం. దీనిని గుర్తించి అధికారులు ఆ గ్రామస్తుల కోరికలను నెరవేర్చాలి.

ఆహార మహాసభ

గుడివాడ తాలూకా ఆహార మహాసభ ఈ నెల 9 వ తేదీని గుడివాడలో జరిగింది. కామ్రేడ్ కానూరి బలరామయ్య అధ్యక్షత వహించారు. మహాసభకు వివిధప్రాంతాల నుండి సుమారు 300 మంది ప్రతినిధులువచ్చారు. మహాసభలో అనుమర్లపూడి సీతారామరావుగారు, పొట్లూరు సుందరం, వి. వి. శాస్త్రిగార్లు తాలూకాలో కమాండీరింగు మొదలయిన విషయాలనుగూర్చి మాట్లాడారు.

మహాసభలో ప్రభుత్వానికి ఈ దిగువ సూచనలు చేయబడ్డాయి.

తాలూకాలో కమాండీరుచేసిన 27000 బస్తాలకు, బస్తాకి రు. 11 రేటు నిర్ణయించాలి. ధాన్యం ధర బస్తా రు. 11 నిర్ణయిస్తూ, దాన్ననుసరించి న్యాయమైన లాభం ఉండేలా బియ్యం ధర, ఇతర ధాన్యాల ధరలు నిర్ణయించాలి. వ్యవసాయ పనిముట్ల ధరలు నిర్ణయించి, అగ్రికల్చరల్ డిపార్టుమెంటు ద్వారా సప్లయి చేయించాలి.

ప్రజా సహకారంతో గ్రామాల్లో ఆహార కమిటీలు ఏర్పరచి, వాటిద్వారానే ధాన్యం కొంటే కమాండరింగు అసలు అవసరమే ఉండదని సూచించారు.

తరువాత సూర్యనేని శ్రీరాములుగారు అధ్యక్షులుగానూ; వంగపాటి రంగారెడ్డిగారు కార్యదర్శిగాను, మరి 9 మంది సభ్యులతో తాలూకా ఆహార కమిటీ ఏర్పడింది.

ఆహారకమిటీలు

ఏలూరు తాలూకా ఆహారకమిటీ ఈనెల 13 వ తేదీని సమావేశమయి ముతకబియ్యం బస్తా 23-4-0, ముతక ధాన్యం 11-8-0 కు మించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని, దొంగవ్యాపారం అరికట్టాలని ప్రభుత్వానికి సూచన చేసింది.

సత్తెనపల్లితాలూకాలో వివిధవర్గాలు, పక్షాల నుండి 23 గ్గురు ప్రతినిధులుగల తాలూకా ఆహారకమిటీని ఎన్నుకున్నారు. దీనికి అధ్యక్షులు దర్శి లక్ష్మయ్యగారు, కార్యదర్శి మోర్తల అనుమారెడ్డిగారు.

పసుమర్రు (కృష్ణాజిల్లా) గ్రామంలో 9 మంది సభ్యులతో ఆహారకమిటీఏర్పడింది.

బళ్ళారిజిల్లా, ఆలూరు తాలూకా నగరదోణ గ్రామంలో శ్రీ కరణం రామచంద్రయ్య (గ్రామకరణం) గారు అధ్యక్షులుగాను, శ్రీ కంసాలి బ్రహ్మయ్యగారు (కో-ఆపరేటివ్ స్టోర్సు కార్యదర్శి) ఉపాధ్యక్షులుగాను, యన్. రామకృష్ణారెడ్డిగారు (గ్రామయువజన సంఘ కార్యదర్శి) కార్యదర్శిగాను, ఆహార కమిటీ ఎన్నుకోబడింది.

బాలబాలికలకు

దసరాపండుగ వచ్చి వెళ్ళింది. ఆపండుగకు కృష్ణాజిల్లా యువజనసంఘం బాల బాలికలకు చక్కని కార్యక్రమం ఇచ్చింది. ఆనాడు ప్రభాత్‌భేరీలు జరిపి, ఆటపాటలు, జండా ప్రతిష్ఠాపన మొదలైనవి జరపాలని సూచించింది. ఆ ప్రకారమే కృష్ణాజిల్లాలో అనేక గ్రామాలలో పొద్దుననే ఊరేగింపు, తర్వాత జండా ప్రార్థన, తర్వాత ఆటలలో, పాటలలో, ఉపన్యాసాలలో పోటీలు జరిపారు. వాటిలో గెల్చిన వారికి బహిరంగసభలలో బహుమతులిచ్చారు. బాలబాలికలు బుర్రకథలు, పాటలు, వేషాలు, నాటకాలువేసి వైజ్ఞానిక ప్రదర్శనాలు చేశారు. ఇలా దసరా మహోత్సవాలను జయప్రదంగా జరిపినట్లు మాకీ గ్రామాల (కృష్ణాజిల్లా) నుండి వార్తలు వచ్చాయి: గుడ్లవల్లేరు, మైలవరం, ప్రొద్దుటూరు, వీరులపాడు, వెల్దిపాడు, పెదపాలపర్రు, ఆత్కూరు, కంకిపాడు, రావులపాడు, గొల్లమందల.

గుంటూరుజిల్లాలో బాలసంఘాలు చాల మందిని ఆకర్షిస్తున్నాయి. కొరిటిపాడులో బాలసంఘాల క్రమశిక్షణ మొదలైనవి చూచి అచటి మిషన్ స్కూల్ హెడ్మాస్టర్ తమ పిల్లల నందరిని సంఘంలో చేర్చుకోమన్నాడు. వడ్లమూడిలో గాంధీ జయంతి సందర్భంలో జాతీయైక్యతా గీతాలతో బాలసంఘం ప్రచారం చేసింది. నర్సారావుపేట తాలూకా, రొంపిచర్లలో తమ పంతుళ్ళు దసరా వసూళ్ళు చేస్తున్నప్పుడు, వాటితోపాటు తమ సంఘానికి రు 2—4—9 వసూలు చేసుకున్నారు. తాలూకా మహిళా సంఘ ప్రచారకురాలైన పార్వతిగారి సహాయంతో వైజ్ఞానిక ప్రదర్శనాలుజరిపారు. ఇది రాత్రి 9-30 నుండి 1గంట వరకు జరిగాయి. అన్నా—చెల్లెలు సంభాషణ మొదలైన పాటలేగాక, చిన్న చిన్న నాటకాలు వేశారు. 1000 మంది స్త్రీ పురుషులు ఆనందించారు. భట్టిప్రోలులో ఒకప్పుడు తెగ అల్లరిచేసే పిల్లవాడు అవన్నీ మాని ఇప్పుడు బాలసంఘానికి నాయకుడయ్యాడు.

పశ్చిమగోదావరిలో దసరాకు పూర్వమే ఏలూరు తూర్పు, పడమర వీధులలో వైజ్ఞానిక ప్రదర్శనాలద్వారా ప్రస్తుతం దేశాన్ని ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించే మార్గాలను గురించి ప్రచారం గావించారు.

* * *

బాలసంఘ సభ్యులు ఇతరుల కెలా తోడ్పడుతున్నారో చూడండి. గుడివాడ తాలూకా వ్యవసాయ కూలీ ఒకడు గంపలగూడెంలో జబ్బుగానున్న కూతురును చూడడానికి 5 రూపాయలతో బయలుదేరాడు. పాపం ఆమె చనిపోయింది. ఆమె దహన ఖర్చులకు ఆడబ్బు సరిపోయింది. డబ్బులేక కాలినడకనే గంపలగూడెంనుండి తన గ్రామానికి బయలుదేరాడు. మైలవరం వచ్చేసరికి తిండిలేక శోషవచ్చింది. మైలవరం బాలసంఘ సభ్యుడు అతనిని చూచి, తనయింటికి తీసుకువెళ్ళి భోజనం పెట్టించాడు. పైగా బెజవాడ వరకు కారులో ఉచితంగాతీసుకొనివెళ్ళేటట్లు పెద్దల తోడ్పాటుతో చేయగల్గాడు. బెజవాడ నుండి కారు ఖర్చుకుగాను 1-4-0 వసూలుచేసి ఇచ్చాడు. ఆ వ్యవసాయకూలీ సంతోషపడి అతని అడ్రసు వ్రాయించుకొని తీసుకు వెళ్ళాడు.

గుంటూరు తాలూకా పొన్నెకల్లులో బాలసంఘం ఇలాగే ఒక ప్రసవించిన స్త్రీకి సహాయపడింది. పొట్టగడవని వ్యవసాయకూలీ స్త్రీలు నిండు గర్భంతో కూడ కూలి చేస్తుంటారు మన దేశంలో. అలాంటి స్త్రీలను ఇండ్లలోనే ఉంచి తిండి మొదలయినవి సహాయం చేసే ఏర్పాట్లు లేవు. వేరుశనక్కాయ కూలికి వచ్చిన ఒక స్త్రీ (ఆమెది ఆలపాడు) చేలోనే ప్రసవించింది. ఈ విషయం తెలుసుకొని బాలసంఘం బట్టలు, జొన్నలు, ఆముదం, కొంత చిల్లరపళ్ళు వసూలుచేసిఇచ్చి సహాయపడింది.

* * *

దీపావళి దగ్గరకు వస్తూంది. దీపావళికి మనవాళ్ళు ఎందుకు పండుగచేస్తారో ఆకథ మీకు తెలుసా? పూర్వం నరకాసురుడు (రాక్షసుడు) ప్రజల్ని నానా యమయాతనలు పెట్టేవాడట. శ్రీకృష్ణుడు సత్యభామ సహాయంతో అతణ్ణి చంపివేశాడు. ఆ ఆనందానికి చిహ్నంగా దీపాలు వెలిగించడం, ఉత్సవాలు చేయడం ప్రారంభించారు.

ఆ నరకాసురుడిలాంటి రాక్షసులు ఈనాడూ ఉన్నారు. వాళ్లే హిట్లరు, ముసోలినీ, టోజోలు. వాళ్ళు ఇతరదేశాలను ఆక్రమించి, స్త్రీలను, పిల్లలను బాంబుల పాలుచేసి నానా హింసలు పెడుతున్నారు. చూచారా! మొన్నీ మధ్య టోజో రాక్షసుడు (జపాను) మన చెన్నపట్టణంపై బాంబులువేశాడు.

ఈ ముగ్గురు రాక్షసులను పూర్తిగా ఓడించిననాడు మనం పెద్ద దీపావళిచేస్తాం. ఇప్పుడుకూడా మనంవాళ్ళపై గెలుస్తున్నాం గనుక చిన్నదీపావళి చేయవచ్చు. ముసోలినీని ముండనుచేసి జర్మనీలో కూర్చోబెట్టాం. రష్యాలో హిట్లరును మనవాళ్ళు చావదన్నుతున్నారు. టోజోపనికూడ త్వరలోనేపడతాం. ఈలోగా వాడు మనల్ని పెట్టే బాధలకి గాభరా పడకుండా మనబలాన్ని చూపెడదాం.

దీపావళినాడు, దసరా పండుగ లాగనే పొద్దున్నే స్నానంచేసి, కొత్తవి (లేకపోతే ఉతికినవి) దుస్తులు వేసుకొని, ఊరేగింపు చేయండి. జండాప్రార్థన చేయండి. ఆటలు, పాటలు ద్వారా ప్రదర్శనాలు జరపండి. మీమీ జిల్లాల యువజన సంఘాలిచ్చే సూచనల ప్రకారం కార్యక్రమం జరపండి.

— దొడ్డమ్మ

★ కార్మికలోకం

యం. యస్. యం. రైల్వేకార్మికుల సంఘ కేంద్ర కార్యనిర్వాహకవర్గం గత మాసం 27,28,29 తేదీలలో పెరంబూరు (మద్రాసు)లో జరిగి ది. అన్ని బ్రాంచి సంఘాలనుండి ప్రతినిధులు హాజరయారు. ఆహార సమస్యను గురించి, ధాన్యపు డిపోలద్వారా ఆహారపదార్థాల సప్లయిని గురించి అన్నిబ్రాంచీలు రిపోర్టులిచ్చిన మీదట, రైల్వేఅధికారులకీదిగువ సూచనలు చేశారు.

రైల్వే అంతటా ఇప్పుడున్న డిపోలు చాలవు. వందమంది పనివారుండే ప్రతిస్టేషను వద్దా డిపో ఏర్పరచాలి.

వేయిమందికి పైగా పనివారుండే కేంద్రాల్లో 500 పనివారికొక డిపోచొప్పున ఏర్పాటుచేయాలి.

రైల్వే అంతటా ఒకే పద్ధతిని రేషనింగు అమలు జరపాలి. కుటుంబ సంఖ్యను బట్టి రేషన్ ఇవ్వాలి.

జీతాలిచ్చిన వారంరోజుల్లో ఆహార పదార్థాల బండి బయలుదేరాలి. దీనిరాకను పనివారికి ముందుగానే తెలియజేయాలి.

డిపోల్లో, కిరసనాయిలు, కట్టెలు కూడా సప్లయి చేయాలి.

ఓపెన్‌లైన్లమీద పనిచేసేవారికి, సమీపంలోఉన్న డిపోలకు ప్యాసులివ్వాలి.

రైల్వే పనివాళ్ళందరికీ మనిషికి, సంవత్సరానికి 66 గజాలు చొప్పున స్టాండర్డు బట్ట సప్లయి చేయాలి.

యూనియన్‌నియమించిన అడ్వైజరీ కమిటీని అధికారులు గుర్తించి, డిపోలను తనిఖీ చేసే హక్కును దానికివ్వాలి.

అందరికి నెలసరి రేషన్లు ఇవ్వాలి.

జీవితావసర సరుకులధర, ముఖ్యంగా బియ్యం ధరను 1942 జూన్‌లో ధరకన్నా నూటికి 20 చొప్పున తగ్గించాలి.

కాయకష్టం చేసే పనివారికి అదనం రేషనింగు ఇవ్వాలి.

డిపోలలో మంచిసరుకు అమ్మాలి.

ఈ సూచనలు చేసిన తరువాత, జమాల్‌పూరు సమావేశంలో మెహతాముఠా కార్మికవర్గ ఐక్యతకు ఎలా భంగం కలిగించిందో ప్రధాన కార్యదర్శి విశదపరిచారు. కార్మికవర్గ ఐక్యతను కాపాడడానికి అఖిలభారత రైల్వే సమ్మేళనం వెంటనే తగు చర్యలు తీసుకోవలసిందని తీర్మానం జరిగింది.

రాజమండ్రి బ్రాంచి వార్షికోత్సవము

యం. యస్. యం. రైల్వే కార్మిక సంఘపు రాజమండ్రి బ్రాంచి 6 వ వార్షిక సమావేశము ఈనెల 3 వ తేదిని జరిగింది. వి. యస్. దేవసుందరంగారు అధ్యక్షత వహించారు. నిడదవోలు, ద్వారపూడి, అనకాపల్లి, బయ్యవరం నుండి 50 మంది ప్రతినిధులు సమావేశానికి వచ్చారు. ఆనాడు సాయంత్రం మహాసభ జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశరక్షణ సన్నాహాలను బలపరుచుటలోను, ప్రజలకు ఆహార పదార్థాలను అందజేయుటలోను రైల్వే రవాణాయొక్క పాత్రను వివరిస్తూ అధ్యక్షులు, ఇతర ఉపన్యాసకులు మాట్లాడారు.

ఈ విషయంలో రైల్వేకార్మికులపైనున్న బాధ్యతను స్పష్టపరుస్తూ ఒక తీర్మానం జరిగింది. కార్మికులు తమతమ పనులను అతి నిపుణతతో, త్వరత్వరగా పూర్తి చేస్తుండాలని హెచ్చరిస్తూ ఒక తీర్మానం చేశారు. రైల్వే కార్మికులు తమ బాధ్యతను జయప్రదంగా నిర్వర్తించాలంటే నూటికి నూరుమంది సంఘాల్లో చేరాలని ఈతీర్మానం ఉద్బోధించింది. ఈ సంఘశక్తితోను, ఆహార పదార్థాల రవాణా చక్కగా జరపడం ద్వారా పొందే ప్రజా సానుభూతి బలంతోను, కార్మికులు తమ కోర్కెల నన్నింటిని నెరవేర్చుకోగలరని తీర్మానం తెలిపింది.

అఖిలభారత రైల్వేఫెడరేషన్ నిర్ణయించినట్లు రూ 30/- యుద్ధ అలవెన్సు యిప్పించాలని, ఆంగ్లోఇండియన్లకు, ఇతరులకు మధ్య రేషనింగు విషయంలో వ్యత్యాసం ఉండకూడదనీ తీర్మానించారు.

గతమాసం 30 వ తేదీని యూనియన్ ప్రతినిధులు డెప్యుటేషన్ వెళ్ళగా మీనియల్సుకి 0-6-0 బేటా ఇవ్వడానికి, రు. 24 లు గ్రేడుమీద ఉన్న ఆగ్వాలాలకు మూడు సంవత్సరాలు సర్వీసుపూర్తికాగానే రు. 28 లు గ్రేడు ఇవ్వడానికి, రాజమండ్రి, బెజవాడ లోకోషెడ్డుల రీ ఆర్గనైజింగు స్కీములోని లోపాలను సవరించడానికి, చౌకడిపోలు విరివిగా స్థాపించడానికి, రైల్వే అధికారులు అంగీకరించారు. వీటిని ఆచరణలో పెట్టేలా కార్మికులు నిర్మాణయుక్తంగా ఆందోళన చేయాలి.

ఇంకా ఇతర తీర్మానాలు జరిగిన మీదట కొత్త కార్య నిర్వాహక వర్గానికి ఎన్నికలు జరిగాయి.

★ అభ్యుదయ రచయితలు ★

ఈనెల 5 వ తేదీని విజయనగరంలో స్థానిక అభ్యుదయ రచయితల యాజమాన్యాన సారస్వత సభ జరిగింది. శ్రీ కూచిమంచి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు, స్థానిక రచయిత శ్రీ చాంగటి సోమయాజులుగారు ఉపన్యసించారు. భాష ఎలా ప్రజాశ్రేయస్సుకు ఉపయోగపడుతూ వచ్చిందో సోమయాజులుగారు వివరించారు. పిచ్చయ్యగారు ఉపన్యసిస్తూ అభ్యుదయ రచయితల సంఘ స్థాపన ఎలా అవసరమయిందో విశదపరిచారు. ఆంధ్ర, నవ్య, సాహిత్య పరిషత్తులు సారస్వత రంగంలో ఎలా అభ్యుదయాన్ని ప్రోత్సహించాయో తెలియజేశారు, ఆ సాంప్రదాయాన్ని ఇంకా ముందుకు తీసుకుపోయి అభ్యుదయ రచయితలు జాతీయ వికాసానికి, నూతన సమాజాభివృద్ధికి దోహదమివ్వాలన్నారు.

మరునాడు న్యాయవాదుల సంఘఆహ్వానంపైని శ్రీ పిచ్చయ్యగారు, ఆసంఘంలో ఉపన్యసించారు. సమాజసేవకు జీవితాన్ని అంకితం చేసిన కందుకూరి వీరేశలింగంగారు, "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుజులోయ్" అని పాడిన గురజాడ అప్పారావుగారు విడిచిపోయిన సంప్రదాయాలను కొనసాగించడమే అభ్యుదయ కవుల ఆశయం అని వీరు చెప్పారు.

సభకు అధ్యక్షత వహించిన శ్రీ కురెళ్ళ సోమసుందరంగారు మనలోఉన్న అభ్యుదయ భావాలన్నిటికీ నిర్మాణ స్వరూపం ఇవ్వగల ఉద్యమం చాల అవసరమన్నారు.

కాకినాడలో

కాకినాడలో, స్థానిక కాంగ్రెసునాయకులు శ్రీ కోమాండూరి శఠగోపాచార్యులుగారు అధ్యక్షులుగా ఇటీవలనే అభ్యుదయ రచయితల సంఘమేర్పడింది. మొన్న 11 వ తేదీన దీని ఆధ్వర్యాన సారస్వత సభజరిగింది. సభకు శ్రీయుతులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రి, బాలగంగాధరతిలక్, పాలగుమ్మి పద్మరాజు, యం. బసవపున్నయ్య గార్లు వచ్చారు.

ప్రగతి రచయిత రామానందభటర్జీ మరణానికి సంతాపం వెల్లడిస్తూ ఈసభ తీర్మానించింది. తరువాత శ్రీ చదలవాడ పిచ్చయ్య మహీధర జగన్మోహనరావు, యన్. అచ్చన్న పంతులుగారు, మొదలైనవారు అభ్యుదయ సారస్వతాన్ని గురించి, అభ్యుదయ రచయితల సంఘ అవశ్యకతనుగురించి వివరించారు

సందేహాలు - సమాధానాలు

'రంగాముఠా' పంచమాంగదళమా?

— మద్దుకూరి చంద్రశేఖరరావు

"అసలు "పంచమాంగదళం" అంటే ఏమిటి? జపాను సామ్రాజ్యతిని వారిఏజెంట్లుగా పనిజేసేవారనేగదా? అలాంటప్పుడు రంగా ముఠాను పంచమాంగదళ మనడం పొరపాటు కాదా?" అని ఒక విలేఖరి తన సందేహాన్ని వెల్లడించుతున్నాడు. ఇలాంటి అనుమానాలే యింకా కొందరికి ఉండవచ్చును గాన వీటికి సమగ్రంగా సమాధాన మిస్తాము.

పంచమాంగదళమంటే ఎవరు?

జపాను సామ్రాజ్యతిని వారి ఏజెంట్లుగా పని జేసేవారిని దేశద్రోహులనీ, పంచమాంగదళ మనీ, దేశభక్తుల దరూ అంగీకరించుతారు. ఇందులో ఎవరికీ సందేహంలేదు. కాని జపాను ఇండియాపైకి దాడివచ్చి బ్రిటీషువారిని ఓడించితే మనకు స్వరాజ్యం వస్తుందని ప్రచారం చేసేవారున్నారు; వీరు జపాన్ దాడిని సులభంచేయడానికి, దేశరక్షణలను భగ్నం చేయడానికి రైలు పట్టాలు పీకడం, టెలిగ్రాఫ్ తీగలు త్రెంచడం వగైరా విధ్వంసక కార్యాలను ప్రోత్సహించుతున్నారు. ఇట్టివారు జపాను దుండగీడులనుండి డబ్బు పుచ్చుకోకపోయినా జపాన్ ఏజెంట్లు చేసే పనినే ఆచరణలో చేస్తున్నారు. కాబట్టి వారిని కూడా పంచమాంగదళమని పిలుస్తాము.

ఐతే విధ్వంసక చర్యలను ఎపుడో ఒకపుడు చేసినవారు, ప్రోత్సహించినవారు అంతా పంచమాంగదళమేనా అను ప్రశ్నవస్తుంది. 1942 ఆగస్టు 8 న ప్రభుత్వం జాతీయ నాయకులను అరెస్టుచేసి, ప్రజలను రెచ్చగొట్టింది. అపుడు అనేకమంది కాంగ్రెస్ దేశభక్తులు, ప్రజలు విధ్వంసక చర్యలలో పాల్గొన్నారు. ప్రభుత్వం కొట్టిన దెబ్బకు దెబ్బతో సమాధానంయిన్వాలనే ఉద్రేకంతో వారాపనులకు పూనుకొన్నారు. అందుచే వారు పొరపాటు బడిన దేశభక్తులేగాని, పంచమాంగదళంకాదు. అట్టివారికి నేటి పరిస్థితులలో దేశరక్షణ కొరకు పాటుబడుటద్వారాను, ఆహారకరువు వగైరా ప్రజాసమస్యలను పరిష్కరించుట ద్వారాను భారత స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు తీసుకు పోగల్గుతామని నచ్చచెప్పవలసివుంది. క్రమంగా వారందరు ఆమనివారణ కార్యాలలో పాల్గొనునట్లు చేయాలి. లీగ్-కాంగ్రెసు ఐక్యతపై ఆధారపడిన జాతీయైక్యతనునిర్మించుటద్వారానే కాంగ్రెసునాయకులను విడిపించుకొని, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించగలమని నచ్చచెబుతాం.

అంతేగాని, పొరబాటుపడిన దేశభక్తులను పంచమాంగదళమని మేము ఎన్నడూ పిలువలేదు. పిలువం. నిజమైన దేశభక్తులు గాంధీజీ ఉపవాససమయంలో ప్రకటించబడిన లేఖలను చూచాక విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమం గాదని స్పష్టంగా తెలిసికొన్నారు. వాటికి దూరంగా వుంటున్నారు.

కాని ఆగస్టు సంఘటనల రోజులలో కాంగ్రెసు పేరుతో రహస్య యంత్రాన్ని నడుపబూనుకొన్న పార్వర్డ్లబ్లాకు, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, తదితర గ్రూపులు మాత్రం విధ్వంసక చర్యలను ప్రోత్సహించుతూనే వున్నాయి. కాంగ్రెసు పేరుతో రహస్య పత్రికలు నడుపుతూ జపాను అనుకూల ప్రచారాన్ని చేస్తున్నారు. విధ్వంసక చర్యలే దేశ స్వాతంత్ర్యానికి మార్గమని రెచ్చగొడుతున్నారు. కాంగ్రెసు పేరుతో ప్రజా ఉద్యమాలను చీల్చడానికి ఎత్తులు వేస్తున్నారు. కాబట్టి గాంధీజీలేఖల అనంతరం కూడ విధ్వంసక చర్యలేకాంగ్రెసుకార్యక్రమంఅనివాదించుతూ, జపాన్ దురాక్రమణదారులకు వినియోగపడే కార్యక్రమం యిచ్చేవారిని పంచమాంగదళమని పిలుస్తాము. వారికి జపాను దుండగీడుల నుండి డబ్బు వస్తుందా? రాదా? అనేది సమస్యేకాదు.

రంగాముఠా మాటో?

ఐతే రంగాముఠా పంచమాంగదళమా అనే ప్రశ్న మిగిలివుంది. దీనికి జవాబివ్వడానికి 1942 ఆగస్టు నుంచి యీముఠా అవలంబించిన రాజకీయాలను పరిశీలించుదాం.

ఈ ముఠా నాయకులు ఆగస్టు సంఘటనల సమయంలో విధ్వంసక చర్యలకు ప్రోత్సాహమిచ్చారు. కాని ఆరోజులలో కాంగ్రెస్ దేశభక్తులలో అనేకమంది యీపొరబాటు దృక్పథంలో వుండేవారని, గాంధీజీ లేఖల అనంతరం మార్చుకొన్నారని పైన తెలిపాము. అందుచే పై కారణంవల్లనే రంగాముఠాను పంచమాంగదళమని పిలవజాలము. ఐతే గాంధీజీ లేఖల అనంతరం రంగాముఠా విధ్వంసక చర్యల యెడల ఏదృక్పథం అవలంబించింది? వాటిని ప్రోత్సహించే పంచమాంగదళం యెడల ఎట్టి దృక్పథం అవలంబించింది? ఈ ప్రశ్నలకు సమాధానంపైనే రంగాముఠా రాజకీయాలు పంచమాంగదళ రాజకీయాలో కాదో తెలుసుకొనగల్గుతాం.

1942 నవంబరులో రంగాముఠా సమావేశమయి తాము మెజారిటీగావున్న ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘాన్ని రద్దుచేసి, నెల్లూరి వెంకటరామానాయుడుగార్ని ఏజంటుగా నియమించింది. నాటినుండి వారే రంగా ముఠాకు నియంతగా వ్యవహరించు తున్నారు. వారి పత్రికఅయిన "జమీన్‌రైతు" రంగాముఠాకు లీగల్ పత్రికగా వినియోగ పడుతూంది. అందుచే "జమీన్‌రైతు పత్రిక" అవలంబించే రాజకీయాలు, అదిచేస్తున్న ప్రచారమే రంగా ముఠా రాజకీయ దృక్పధాన్ని తెలిపే అద్దం వంటిదని చెప్పవచ్చు.

ఐతే పూర్వం రంగాముఠాలో వుంటూ రంగాగారి యెడల వ్యక్తిగత అభిమానంగల అనేకమంది విధ్వంసక రాజకీయాలలో ఎట్టి జోక్యం కల్గించుకోలేదు. ఒకభాగం రాజకీయాలనుంచే తప్పుకున్నారు. ఒక భాగం పునరుద్ధరించబడిన రైతు సంఘాలలో చేరి తమశక్తికొలదీ ప్రజాసేవ చేస్తున్నారు. వీరిలో ఎవరికీ పంచమాంగదళం ప్రోత్సహించే విధ్వంసక చర్యలతో సంబంధం లేదు. మిగిలినభాగం 'జమీన్‌రైతు' ద్వారా తమ నాయకత్వం సూచించుతున్న కార్యక్రమాన్ని సాగించేవారు. వీరినే ప్రస్తుతం రంగాముఠా అని పిలుస్తున్నాము. వారి ముఖపత్రమైన జమీన్‌రైతు రాజకీయాలను పరిశీలించుట ద్వారానే వీరి రాజకీయాల పరమావధి ఏమిటో తెలిసికోగల్గుతాము.

కాంగ్రెసు సోషలిస్టుపార్టీ ఇమిటేషన్

పంచమాంగదళం ఒక ఫోర్జరీ ఉత్తరాన్ని సృష్టించి, కమ్యూనిస్టులుప్రభుత్వంవద్ద లంచం పుచ్చుకొన్నారని రహస్య పత్రికలద్వారా ప్రచారం చేసింది. ఆంధ్రదేశంలో అదే ప్రచారాన్ని 'జమీన్‌రైతు' పత్రిక కొనసాగించింది. 12-3-43 సంచిక సంపాదకీయ వ్యాఖ్యలో ఈదుష్ప్రచారాన్ని ప్రారంభించింది. అవుత్తరం కాంగ్రెసు సోషలిస్టులచే ఫోర్జరీ చేయబడిందని కామ్రేడ్ క్రిష్ణన్ ఒక వ్యాసంలో నిరూపించాడు. 5-4-43 'జమీన్‌రైతు' పత్రిక ఓగ్‌పూవాలా అనే పేరుతో ఫోర్జరీ ఉత్తరాన్ని ప్రత్యక్షంగా సమర్ధించుతూ రంగుబయటపెట్టుకొంది. అనగా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ చేసేపనినే ఆంధ్రలో 'జమీన్‌రైతు' పత్రిక (రంగాముఠా) చేస్తోంది.

ఆగస్టు 9 వార్షికోత్సవానికి ఆంధ్రలో పంచమాంగదళంచే ప్రకటించబడు 'రణగర్జన' అనే రహస్యపత్రిక స్పష్టంగా విధ్వంసక చర్యలు సాగించమని కార్యక్రమమిచ్చింది. అదే సంచికలో జయప్రకాశ నారాయణ "పోరాటంలో మొదటిదెబ్బ కొట్టడమయిపోయిందనీ, ఇక రెండో దెబ్బ కొట్టడానికి తయారు గావాలనీ" ప్రకటన చేశాడు. 1943 ఆగస్టుకు కాంగ్రెసు దేశభక్తులు విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమంకాదని తెలిసికొన్నారు. రహస్యంగా కాంగ్రెసు పేరుతో పత్రికలను ప్రకటించడానికి ఎవరికీ అధికారంలేదనికూడ దేశభక్త కొండా వెంకటప్పయ్య, శ్రీమతి సరోజినీదేవిగార్లవంటి ప్రసిద్ధ కాంగ్రెసువాదులే ప్రకటించారు. కాని జపాన్ అనుకూలవాదులుమాత్రం తమ విధ్వంసక కార్యక్రమాన్ని కాంగ్రెస్ పేరుతో ప్రకటించే రహస్య పత్రికలలోనే యిస్తూవచ్చారు. అందుకు ఆగస్టు ప్రారంభంలో ఆంధ్రలో పంచబడిన రణగర్జనే ప్రత్యక్ష సాక్ష్యం.

రణగర్జణ వ్రాతలను జైప్రకాశ వాదనలను 'జమీన్‌రైతు పత్రిక' ఆగస్టు 6 తేదీ సంచికలో లీగల్ పరిభాషలో పునరుద్ఘాటించింది. జయప్రకాశ్ పోరాటంలో రెండో దెబ్బ కొట్టడనికి తయారుకావాలంటే, జమీను రైతులో "సామ్రాజ్యవాదమును ఓడించలేకపోయామని గోళ్ళుగిల్లుకుంటూ కూర్చుంటే ప్రయోజనమేమి? జాతీయ శక్తి యుక్తు లన్నింటితో స్వాతంత్ర్యం సాధించాలిగదా?" అని కోలనార్ హెచ్చరించుతున్నాడు. అనగా క్రిందటి ఆగస్టురోజులలో జరిగిన చర్యలన్నిటినీ తిరిగి కొనసాగించాలనే గదా! అంటే పంచమాంగదళ ప్రచారాన్ని లీగల్ భాషలో పునరుల్లేఖించడంగాదా?

ఖూనీల సమర్థన

బెంగాల్‌లో కామ్రేడ్ ఫణిచక్రవర్తిని పంచమాంగదళం ఖూనీ చేసింది. దేశరక్షణ కార్యక్రమంగా గల కమ్యూనిస్టులపైన, దేశరక్షణలను భగ్నంచేసి జపాన్ దుండగీడులను ఆహ్వానించాలనే పంచమాంగదళం కత్తికట్టడం సహజమే. దేశద్రోహులగు పంచమాంగదళంచేసిన యీఖూనీని 27-8-43 'జమీన్‌రైతు' ఎలాసమర్ధించిందో చూడండి. "కమ్యూనిస్టు నాయకులు చెప్పినమాట "విశ్వసించినందుకు అనుచరునికి పట్టినగతి చూచారా! ఈ టక్కరి గురువులు అడ్డం వచ్చారా?" అని బెదిరించుతూ వ్రాసింది. ఇది పంచ మాంగదళం చేసిన ఖూనీలను పరోక్షంగా సమర్థించడంగాక మరేమిటి!

విచ్ఛిన్న కార్యక్రమం

పంచమాంగదళం గావిస్తున్న విధ్వంసక కార్యక్రమాన్ని కాంగ్రెసువాదులు అనుసరించడంలేదని తెలుసుకొని, ప్రజాఉద్యమాలను కాంగ్రెసు పేరుతో చీల్చాలనేనినాదంతో బయలుదేరారు. ఆంధ్రలో పంచమాంగదళ కార్యక్రమంతో పనిచేస్తున్న భూపతి కోటీశ్వరరావు, చివుకుల వెంకటేశ్వర్లు వగైరాలకు 'జమీన్‌రైతు' పత్రిక లీగల్ ముఖపత్రంగా ఉపయోగపడుతూంది. ప్రజాఉద్యమాలను చీల్చడానికి వారు చేసే ప్రచారంతో పేజీలు నింపుతోంది.

ఉదాహరణకు 8-10-43 సంచికలో కోలనార్ అనే పేరుతో ఒకవ్యాసం పడింది. అది కాంగ్రెస్‌పేరుతో రహస్య పత్రికలు నడుపుతూ జపాన్ అనుకూల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ సోషలిస్టులు వగయిరాలను సమర్ధించుతూంది. "అలనాడు దేశమంతటా జరిగిన విధ్వంసక చర్యలను సమర్ధించడం గానీ, నిరసించడంగాని యింతవరకు గాంధీజీ చేయ్యలేదు," అని వ్రాసింది. గాంధిజీ తన లేఖలలో విధ్వంసకచర్యలను ఖండించడం అందరికీతెలిసిందే. అయినా గాంధీజీ వ్రాతలలోలేనిది గాంధిజీకి అంటగట్టి అయినా తన పంచమాంగదళ మిత్రులను సమర్ధించుకోవాలని చూచింది 'జమీన్‌రైతు'. ఇది పరోక్షంగా విధ్వంసకచర్యల కార్యక్రమాన్ని బలపరచడమే ననడంలో సందేహమేముంది!

పై విధంగా రంగాముఠా పత్రిక అయిన జమీన్‌రైతు పంచమాంగదళ కార్యక్రమం సాగించేవారికి లీగల్ పత్రికగా వినియోగపడుతూంది. వారి వాదనలనే లీగల్‌భాషలో పెడుతోంది. రంగాగారు జైలుకువెళ్ళినప్పుడు రంగాముఠా తరపున వ్యవహరించడానికి ఎన్నుకోబడ్డ వెంకట్రామానాయుడి పత్రిక రాజకీయాలివి. ఈ పత్రికలోనే రంగాగారి 'వాహిని' లో పనిచేసిన కె. యల్. నింహా కూడ సహాయ సంపాదకుడుగా ఉన్నాడు. బయటఉన్న తదితర ప్రముఖ రంగా అనుచరులు, ఈరాజకీయాలను ఖండించనూలేదు.

అందుచే 'జమీన్‌రైతు' రాజకీయాలను రంగాముఠా రాజకీయాలుగ పరిగణించుచున్నాం. వానిని పంచమాంగదళ రాజకీయాలని పిలుస్తున్నాము. పూర్వం ఆ ముఠాలో వున్నా యిపుడు పంచమాంగదళ రాజకీయాలను అనుసరించని వారిని మేము పంచమాంగదళమని పిలుచుటలేదు.

పంచమాంగదళం అని మేము దేశభక్తులందరినీ పిలుస్తున్నామని జపాన్ అనుకూల కార్యక్రమాన్ని అనుసరించేవారు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది అసత్యమని పైన స్పష్టపరచాం. జపాన్ ఎజంట్లు యిచ్చే కార్యక్రమాన్ని ప్రచారంచేసేవారిని మాత్రమే పంచమాంగదళం అంటున్నాము. ఈ తేడాను దేశభక్తులు గమనించగోరెదము.

పాటలు పంపేవారికి మనవి

★

'ప్రజాశక్తి'లో ప్రచురించుటకు చాలా మంది పాటలు పంపుతున్నారు. వాటిని ప్రచురించేదీ లేనిదీ, ప్రచురించనిచో ఎందుకు ప్రచురించనిదీ, జవాబులు వ్రాస్తామని వారు ఆశించుతున్నారు ఇది సాధ్యంకాదు. ఎందువల్లనంటే, పంపే పాటల సంఖ్య చాలా ఎక్కువ. పత్రికలో ఒక పాటకంటె ఎక్కువ వేయటం అసాధ్యం. రెండో విషయం: ప్రతిపాట అందిందో లేదో, ప్రచురించుతామో, ప్రచురించమో జవాబులువ్రాయాలంటే, చాలా కాలం తీసుకుంటుంది. మరొక విషయం: సాధారణంగా పాటలలోని రాజకీయ పొరపాట్లను తెల్పగలమేగాని, ఎలా మంచి పాటలు వ్రాయాలి అని వివరించడం కష్టం.

పత్రికలో ప్రచురించడానికి వచ్చిన మంచి పాటలను (స్థలాభావంవల్ల ప్రచురించకపోతే) అప్పుడప్పుడు పుస్తక రూపంలో ప్రచురించుతాము.

— సంపాదకవర్గం.

★ యుద్ధ సమీక్ష

సంధి పుకారులను వ్యాపించుతూన్న దెవరు?

●

వరుణదేవుడు కూడా హిట్లరుకు సాయపడటంలేదు. సోవియటు విజయయాత్ర వర్షాలనుకూడ లెక్కచేయకుండా ముందుకు సాగుతోంది రెడ్‌ఆర్మీ విటబెన్స్కను సంపాదించుతోంది. గోమెల్ శివారులలో రెడ్‌ఆర్మీ ప్రవేశించుటేగాక, రెడ్‌ఆర్మీమరొక క్రొత్తదాడిని ప్రారంభించి, గోమెల్‌ను పక్కగా దాటి ఒక పట్టణాన్ని పట్టుకొంది. ఈ దాడి 30 మైళ్ల నెడల్పున సాగింది. గోమెల్‌కు పశ్చిమంగాను, నైరుతిగాను సోవియటు సైన్యాలు చొచ్చుకుపోయాయి. గోమెల్ వెనుక జర్మన్లు పారిపోవడానికి పనికివచ్చే రోడ్డు సోవియటు ఫిరంగులకుయిదివరకే అందుబాటులోవుంది. అందుచే గోమెల్ పతనం సమీపించిందని వేరే చెప్పనక్కరలేదు.

క్రొత్త దండయాత్రలు

కీవ్‌వద్ద జర్మన్ల పరిస్థితి నానాటికి విషమించుతోంది. ఇక్కడ నీపర్‌నదిని దాటి రెడ్‌ఆర్మీ 12 పడవ వంతెనలను నిర్మించి వాటిని విశాలం చేస్తూంది. 8 డివిజన్ల సైన్యమిదివరకే దాటింది. పెద్ద పెద్ద బరువాటి టాంకులను సైతం ఈ పడవ వంతెనలపైగా దాటించుతున్నారు రష్యన్లు. సోవియటు విమానదళం వాటిని గొడుగులా కాపాడుతోంది. కీవ్ కెదురుగానున్న టుఖనావ్‌దీవిలో సోవియటు సైన్యాలు కాలు పెట్టాయి. కీవ్‌కు ఉత్తరాన దక్షిణాన అతిసంకులసమరం జరుగుతోంది. జర్మన్లు క్రొత్త కొత్త టాంకు దళాలనుతెచ్చి తిరుగుదాడులు సల్పినా, అవి విఫలమౌతున్నాయి. సోవియటు టాంకు, ఫిరంగి దళాలకు తోడు సుప్రసిద్ధమయిన సోవియటు అశ్విక (కొసాక్) దళం నిలిచి పోరాడుతోంది. కీవ్ వెలుపలి రక్షణలు తుత్తునియలైనాయి. ఇంకా దక్షిణాన జాప్రోజ్‌నగరం పట్టుపడింది. (ఇక్కడే సుప్రసిద్ధమైన నీపర్ డాం కట్టబడింది. 5 ఏండ్లు కృషిచేసి కట్టిన ఈ డామును శత్రువులకు చిక్కకుండా సోవియటు నాశనం చేసింది.) అక్కడనుండి క్రైమియాకు వెళ్లే రైలుమార్గం తెగగొట్టబడింది. ఈ రైలు మార్గంలోనే క్రైమియాకు నెత్తిన ఉన్న మెల్టిపోల్‌లో గత ఆరుదినాలనుండి ఘోరయుద్ధం జరుగుతోంది. మెల్టిపోల్ వీధులలో ఒక్కొక్క ఇంటినీ వశపరచుకుంటూంది. సగం పట్టణం రెడ్‌ఆర్మీ వశమైంది. ఈ విజయాలకు తోడు రెడ్‌ఆర్మీ క్రెమెన్‌చగ్‌వద్ద 30 మైళ్లవెడల్పున పురోగమించి, జర్మను రక్షణశ్రేణులలోకి 15 మైళ్లు చొచ్చుకుపోయింది. ఈ దండయాత్ర నీపర్ పెట్రోవస్క (ముఖ్యపారిశ్రామికపట్టణం)ను విముక్తి చేయడానికి ఉద్దేశింపబడింది.

దండయాత్రల ఉద్దేశం

ఇలా క్రెమెన్‌చగ్ నుండి మెల్టిపోల్ వరకు సోవియటు గావించే దండయాత్రల ఉద్దేశ్యం ఏమిటి? నీపర్ మలుపులోని, క్రైమియాలోని జర్మను సైన్యాలను చుట్టుముట్టి, స్టాలిన్‌గ్రాడ్‌లోవలె లక్షలాది జర్మన్లను హతమార్చడం.

జర్మన్లు ఆశపెట్టుకొని నిలబడదామనుకొన్న నీపర్ రక్షణశ్రేణి, చలికాలపు రక్షణశ్రేణులు నాశనమయ్యాయి. రెడ్‌ఆర్మీకి పట్టుబడ్డ జర్మను ఆఫీసర్లు చెప్పినదానినిబట్టి, నీపర్‌శ్రేణికి ఒక్క అడుగుకూడా వెనక్కి వేయవద్దని హిట్లరు ఆజ్ఞ. కాని రెడ్‌ఆర్మీ ఉధృతం ముందు హిట్లర్ ఆజ్ఞ చొప్పున జర్మను సైన్యాలు నిలువజాలవు.

"మీరు మీ మనోనిబ్బరాన్ని కాపాడుకొంటే, విజయం ఖాయం" అంటూ హిట్లరు నోటివెంట అపశబ్దాలు బయల్దేరాయి. ఇది జర్మనీలోని అశాంతిని తెలియజేస్తుంది.

'సంధి' పుకార్లు

"స్టాలిన్‌కూ- హిట్లరుకూ సంధిజరిగింది వాళ్ళ ఒడంబడిక ప్రకారమే హిట్లరు వెనక్కి తగ్గుతున్నాడు. 1941 నాటి సరిహద్దులను హిట్లరు దాటగానే, సంధి బయటపడుతుంది." అంటూ కొన్ని వదంతులు బయలుదేరాయి. కాని 'ఒడంబడిక' ప్రకారమే హిట్లరు తిరోగమించితే, ఈ తీవ్ర ప్రతిఘటనలు దేనికి?

జులై 5 వ తేదీ నుండి సెప్టెంబరు 5 లోగా 2 నెలలలోనే 4 లక్షల సైన్యాలను (స్టాలిన్‌గ్రాడ్‌లో 4 నెలలలో పోగొట్టుకొన్న వానికంటె ఎక్కువ), 5729 విమానాలను, 8400 టాంకులను, 5192 ఫిరంగులను 28 వేల లారీలను నష్టపోవడం దేనికి? ప్రతిపట్టణాన్ని నాశనం చేస్తూ తనప్రజలను పశువుల మందలాగా తోలుకువెళుతుంటే, స్టాలిన్ చూస్తూ ఊరకుండుటేనా ఈ 'ఒడంబడిక' సారాంశం? ఇదంతా అభూతకల్పన. మన దేశంలో పంచమాంగదళం, అటు యూరప్‌లో హిట్లరుఅనుకూలురు వ్యాపింపజేసిన వదంతులివి. హిట్లరు యుద్ధయంత్రాన్ని, దానితోపాటు నాజీ రాజ్యాన్ని కూలద్రోయడమే సోవియట్ ఆశయం.

పైవదంతి వచ్చిన కొన్ని రోజులకే మరో వదంతి వ్యాపించింది. అది జర్మనీ బ్రిటన్ అమెరికాలతో సంధిచేసుకుంటుందని. ఈవదంతులను వ్యాపింపజేయడానికి కారణమేమిటి? మిత్రరాజ్యాలలో చీలికలు తేవడం, ముఖ్యంగా రేపు జరుగబోయే త్రైరాజ్య సమావేశాన్ని భగ్నంచేయడం. యూరప్‌లో కమ్యూనిస్టు విప్లవాలభయం చూపడం, రెండవ రంగం అలస్యం చేయడం, హిట్లరు తూర్పురంగంలో నిలదొక్కుకొనేటట్లు ఆ విధంగా సాయం చేయడం - ఇవీ ఫేసిస్టు అనుకూలురు వదంతులను వ్యాపింపజేయుటద్వారా పొందదలచిన లాభాలు.

ఇపుడు మిత్రరాజ్యాలలోను తటస్థరాజ్యాలలోను జరుగుచున్న సోవియటు ప్రతికూల ప్రచారానికి మూలము బెర్లినూ, బెర్లిను మిత్రులేనని 'ప్రవడాపత్రిక' అంది. పరస్పర మైత్రిని చెడగొట్టడానికే ఈ ప్రచారం అని చెప్పింది. బాల్టిక్ రాష్ట్రాల విషయమై ఇలా అంది. "రానున్న త్రైరాజ్య సమావేశంలో రష్యా సరిహద్దుల గురించిన ప్రశ్నయేరాదు. సంయుక్త రాష్ట్రాల (అమెరికా) సరిహద్దులను గురించిగాని, కాలిఫోర్నియా పరిస్థితిని గురించిగాని, చర్చించడం ఎంత అసంభవమో, ఇదీ అంతే."

రెండవరంగం ప్రాధాన్యత

ఈసమావేశంలో ముఖ్యంగా రెండవ రంగాన్ని గురించి చర్చించాలని "ప్రవడా" వ్రాసింది.

"యుద్ధానంతర వ్యవస్థను గురించిగాని, యుద్ధానంతరం దీర్ఘ కాల రష్యాతో బ్రిటన్, అమెరికాలు స్నేహంగా ఉండాలన్నాగాని, మొట్టమొదట హిట్లరునుఓడించడం అవసరం. అందుచే హిట్లరు ఓటమిని త్వరితంచేసే విధానం చర్చించడంప్రధానం." 'ఇజ్వెస్టియా' కూడ ఇలాగే వ్రాసింది.

అయితే, రెండవరంగంవిషయమై సాకులు చెప్పేవారు లేకపోలేదు. మంత్రి సింక్లయిర్ "ప్రజలు రెండోరంగం కావాలంటున్నారు. కాని విమానరంగానికి జర్మన్లు భయపడుతున్నట్లుగా మరోరంగానికి భయపడటంలేదు." అని తేలికగా రెండోరంగాన్ని కొట్టిపారేయాలని చూచాడు.

"రైనాల్డ్సున్యూస్" లో ఒక జక్ మిలిటరీ ప్రముఖుడు హిట్లరు ప్లానును ఈ విధంగా వివరించాడు. "యుద్ధాన్ని పొడిగించడం, మిత్రరాజ్యాలలో చీలికలు తే ప్రయత్నించడం, బేషరతుగా లొంగకుండా సంధికోసం రాయబారాలు ప్రారంభించడం," ఇదీప్లాను.

ఈ ప్లానును ఓడించడానికి వట్టి విమాన యుద్ధాలే చాలవు. డిసెంబరు నెలాఖరులోగా సోవియట్‌కోరుతున్న రెండవరంగంతెరవాలి.

ఇటలీలో వాల్టెర్నో నదిని దాటి మిత్రసైన్యాలు కొన్ని ముఖ్యపట్టణాలను వశపరచుకొన్నాయి. రోమువైపు పోయే రహదారుల కోసం యుద్ధం జరుపుతున్నాయి.

తటస్థ దేశాల వైఖరి

తటస్థ దేశాల వైఖరికూడ మిత్రరాజ్యాలకనుకూలంగా మారుతూ వుంది. పోర్చుగల్ ఆజోర్ దీవులను మిత్రదేశాల ఉపయోగానికి ఇచ్చింది. బడోలియో ప్రభుత్వం జర్మనీపై యుద్ధం ప్రకటించింది. యుద్ధానంతరం ఎలాంటి ప్రభుత్వం కావాలి అన్నది ప్రజలకు విడిచిపెడతానని ఈ సందర్భంలో బడోలియో వాగ్దాన మిచ్చాడు. క్రోట్‌లోని జర్మను కీలుబొమ్మ ప్రభుత్వం రాజీనామానిచ్చింది. యుగోస్లావ్‌లో ఇదివరదాకా ద్రోహి మిహిలోవిచ్‌తో గలిసి దేశభక్తులైన గెరిల్లాలను అణచుచున్న ఇటాలియన్‌దళం బడోలియో ప్రకటన ఫలితంగా గెరిల్లాల ప్రక్క చేరింది. యుగోస్లేవియా గెరిల్లాలు అచ్చటచ్చటా కొన్ని పట్టణాలను వశంచేసికొంటున్నారు. ఈ తిరుగుబాట్లను అణచడానికి రోమెల్ ఇక్కడకు రావలసివచ్చింది. రుమేనియాలో ఇద్దరు మంత్రులు ముసోలినీ ప్రభుత్వాన్ని రుమేనియా గుర్తించినందుకు అసమ్మతి తెల్పారు. బల్గేరియా విదేశాంగ మంత్రి రాజీనామా నిచ్చాడు. డెన్మార్కులో విధ్వంసక చర్యలు తిరిగి తలయెత్తాయి.

పసిఫిక్ రంగంలో

రాబాల్‌పై దాడిచేసి, మెకార్థర్ వైమానికులు ఒక్కరోజులో 199 జపాను విమానాలను, 120 జపాను నౌకలను నాశనంచేశారు. ఇది ఆస్ట్రేలియా ప్రక్కలో బల్లెంగా ఉన్న రాబాల్‌ను నాశనంచేయడానికి నాంది అన్నమాట.

తుమ్మల వెంకటరామయ్య.

18-10-43.

మన రాజకీయాలు

(2 వపేజీ తరువాయి) వ్యాపారస్తులవద్ద దాగియున్న సరకునుబయటికి లాగలేకపోయింది. ఫలితం, దొంగ మార్కెట్టులో ధాన్యం, బియ్యం విపరీతమైన ధరలకు అమ్ముతున్నారు. ఇంతేకాదు, మొన్న సెప్టెంబరులో కోతకువచ్చిన పునాసపైరు అంతా, మొత్తం 20 లక్షల టన్నులు, దొంగ మార్కెట్లోకి మాయమైపోయింది! అనగా బెంగాల్ రాష్ట్రానికంతకూ 3 నెలల గ్రాసం తిండి దొంగల కొట్లలో మూలుగుతోంది! ఫలితం, కంట్రోలు ధరలకంటే నాలుగురెట్లు, ఐదు రెట్లు, అధికంగా దొంగమార్కెట్లో, అమ్ముతున్నారని 'హిందూ' పత్రిక న్యూఢిల్లీ విలేఖరి వ్రాస్తున్నాడు. కలకత్తానగరంలోనే గాక, చిట్టగాంగ్ - మొదలైన జిల్లాలలో వేలకొద్దీ ప్రజలు తిండిలేక వీధులలో రాలిపోతున్నారు. అనేక ప్రాంతాలలో షాపులు మూసివేయబడ్డాయి.

క్రొత్త ఆర్డినెన్సు

నిలవవ్యాపారాన్ని, అధికలాభాల వ్యాపారాన్ని, అరికట్టుటకు యీమధ్య ఇండియా ప్రభుత్వం ఒక కొత్త ఆర్డినెన్సును జారీ చేసింది. ఆహార పదార్థాలకు, కంట్రోలు యిదివరకే అమలులోఉన్న యితరవాటికి, తప్ప మిగతావాటికి యిది వర్తిస్తుంది. దీని ప్రకారం ఒక కుటుంబానికి సాధారణంగా అవసరమయే స్టాకుకంటే ఎక్కువ స్టాకును ఎవరూ ఉంచుకోకూడదు. ఉత్పత్తి అయిన ధరకంటె 100 కి 20 పైబడి యెవరూ అమ్మకూడదు. (రవానా ఖర్చులు కాకుండా) వ్యవసాయ పరికరముల కవసరమైన యినుము, నిత్యజీవితావసర వస్తువులు, కిరోసిన్, పంచదార, కాగితం వగైరాలకు యిది వర్తిస్తుంది. తగినంత స్టాకును ప్రభుత్వం అందజేయుటకు కూడా పూనుకున్నట్లు ప్రభుత్వ సభ్యుడు తెలియ జేస్తున్నాడు. ఈ విధంగా, ఆహారపదార్థాలమీద, ప్రజల కవసరమైన నిత్యజీవితావసర వస్తువులమీద, కంట్రోలును ప్రవేశపెట్టడంవల్ల కరువు సమస్యను చాలవరకు పరిష్కరించవచ్చును.

ఆంధ్రరైతుల కర్తవ్యం

కాని, కరువు సమస్యను జయప్రదంగా పరిష్కరించాలంటే నిర్ణయాలు, ఆర్డినెన్సులు, సరిపోవు. ప్రజల సహకారం ఉంటేనే నిలవ వ్యాపారాన్ని అరికట్టడంగాని, ధరలకంట్రోలు అమలు జరగడంగాని, స్టాకులు సప్లయి కావడంగాని సాధ్యమౌతుంది. ప్రజా సహకారం లేకపోతే, స్థానికాధికారుల అవకతవకలు- తిండిదొంగల పన్నాగాలు మామూలుగానే కొనసాగుతాయి. బట్ట కరువుకు నిలవవ్యాపారస్థులు ఎలాకారణమో, అలాగే ఆహారపదార్థాల కరువుకు తిండిదొంగలే ప్రధానకారణమను విషయం ఆంధ్రరాష్ట్రరైతు సంఘం గ్రహించింది. అట్టి తిండి దొంగల దోపిడీని అరికట్టుటకు ధరలకంట్రోలు ఒక ముఖ్య సాధనమని తెలిపింది. కాబట్టి, ఆంధ్ర రైతాంగం ఆహార పదార్థాల ధరలపై విధించబడబోవు కంట్రోలును బలపరుస్తూ, ఇతర జీవితావసరాల ధరలపైకూడా కంట్రోలు పెట్టవలసిందని ఆందోళనచేయాలి.

కొద్దిరోజుల్లోనే పంటలు కోతకువస్తాయి. పంటఅంతా బెంగాలులో మాదిరి తిండి దొంగలకు వశంకాకుండా మన ఆంధ్ర రైతాంగం జాగ్రత్తపడవలసియుంది. ప్రతి గ్రామంలోను రైతాంగం తమకుపండిన వంటలో ఎనిమిదవ వంతు ఆహారకమిటీల ద్వారాగాని, రైతు సంఘాలద్వారాగాని, ప్రభుత్వానికి అమ్ముటకు ముందుకురావాలి. ప్రభుత్వం ఇలా సరుకును కొని, పబ్లిక్ గిడ్డంగులలో నిలవచేయాలి. ప్రజావసరాలను తీర్చడానికి యీ సరుకును లైసెన్సుపొందిన వర్తకులద్వారా కంట్రోల్ ధరలకు అమ్మించాలి. అప్పుడే కంట్రోల్ ధరలు స్థిరపడతాయి. దొంగమార్కెటు రద్దు అవుతుంది.

17-10-43

కార్మికవర్గ విచ్ఛిన్నకులకు మరొక గుణపాఠం

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు జనరల్ కౌన్సిల్ సమావేశం కిందటిసారినాగపూర్‌లో మే నెలలో జరిగింది. మళ్లీ మొన్న సెప్టెంబరు 24, 25, 26 తేదీలలో కలకత్తాలో జరిగింది.

ఈలోగా దేశంలో కరువు సమస్య భయంకర స్వరూపం దాల్చింది. ప్రతిరోజూ వేలకొలది అన్నాతురులు ప్రాణాలు విడుస్తున్నారు. వందలకొలది కుటుంబాలు విచ్ఛిన్నమయిపోతున్నాయి. ఈ పరిస్థితులలో - కరువు సమస్యను పరిష్కరించడం ఎలాగ ? అన్న సమస్య ఒక్కటే ఈ సమావేశంలో ప్రాధాన్యత వహించింది. దేశాన్ని, కార్మికవర్గాన్ని ఎదుర్కొంటున్న ప్రధానసమస్యలను గురించి - ముఖ్యంగా ఆహార సమస్యను గురించి, అందరకూ అంగీకారమైన తీర్మానాలను తయారు చేయడానికి జనరల్‌కౌన్సిల్ ముందుగానే ఒక సబ్ కమిటీని నియమించింది. ఈ సబ్‌కమిటీలో అన్ని గ్రూపులకు, పార్టీలకు ప్రాతినిధ్యం ఇచ్చారు.

రాజకీయ ఖైదీల విడుదల, అధిక ధరల అలవెన్సు, మొదలైన సమస్యలపై అందరికీ సమ్మతమైన తీర్మానాలను సబ్‌కమిటీ తయారుచేయ గలిగింది. కాని, కార్మికవర్గ విద్రోహకులు, వారి వలలో పడినవారు ఆహారసమస్యపై అందరికీసమ్మతమైన తీర్మానం ప్యాసు కాకుండా చేశారు. కామ్రేడ్ లహరి అన్నట్లు, "ప్రజలేమీ చేయలేరనే నిరాశవల్ల ప్రభుత్వాన్ని దూషించడంతో సంతృప్తిపడే పంథాను సూచించే తీర్మానాన్ని వీరు తెచ్చారు. పరిస్థితులు నానాటికి విషమించిపోడానికి, లూటీలకు, కలహాలకు ఈ తీర్మానం దారితీయగలదు. అంటే, ఆహార పదార్థాల సప్లయి ఇంకా క్షీణించి పోవడమన్నమాట."

విచ్ఛిన్నకుల పన్నాగం

వీరెందుకిలాంటి తీర్మానాన్ని ప్రతిపాదించారు ? కార్మికవర్గ విచ్ఛిన్నకులూ, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ పంచమాంగదళమూ, నాగపూర్ సమావేశంలో లాగానే, ఇప్పుడు కూడా కుట్రలుసాగించారు. తమ దుష్టగ్రహాలను కూడదీసుకొని, ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుమీద జాతీయ విద్రోహ కరమైన పంథాను రుద్దబోయారు. కాని, వీరి పన్నాగం సాగలేదు. సంఘటిత కార్మికవర్గం, నాగపూర్‌లో లాగానే ఇప్పుడుకూడా వీరిని దూరంచేసింది.

పూర్తిగా ఓడిపోయారు

సబ్‌కమిటీలో వీరి తీర్మానం ఓడిపోయింది. కాని, కౌన్సిల్ సమావేశంలో తమ తీర్మానాన్ని తిరిగి ప్రతిపాదించారు. బూటకపు తీవ్రవాద పదజాలంతో తీర్మానం ఉంది. కమ్యూనిస్టు ప్రతికూల సమ్మేళనాన్ని తయారు చేయడానికి అన్ని విధాల వీరు ప్రయత్నించారు. కాని, అన్నిట్లోను పూర్తిగా ఓడిపోయారు.

జనరల్‌కౌన్సిలు సమావేశానికి వచ్చిన ప్రతినిధులు 43 గ్గురు. వీరిలో కమ్యూనిస్టులు 26గురు. విచ్ఛిన్నకులతీర్మానానికిఅనుకూలంగా ఓటుచేసినవారు మొత్తం 5 గురు మాత్రమే.

ముందుకు మరొక అడుగు

ప్రభుత్వాన్ని ఊరకనే ఆడిపోసినంత మాత్రాన ప్రయోజనంలేదని కలకత్తాయొక్క విషాదదృశ్యం అందరికీ స్పష్టపరచింది. అందువల్లనే కాంగ్రెసు సోషలిస్టుపార్టీ పంచమాంగదళం మునుపెప్పుడూ కానం-తగా కార్మికవర్గంనుంచి దూరమయింది.

కలకత్తా సమావేశంలో నెగ్గిన ఆహార తీర్మానం, నాగపూర్ సమావేశంలోని తీర్మానాన్ని అనుసరిస్తూ, మరొకఅడుగు ముందుకు పోయింది. అధికాహారోత్పత్తికి నాగపూర్ సమావేశం సందేశం ఇవ్వలేకపోయింది. అప్పుడా సందేశాన్ని ప్రతిఘటించినవారే ఇప్పుడు కలకత్తా తీర్మానంలో దానిని చేర్చ దానికి ముందుకొచ్చారు.

సోదర కార్మికులకు సందేశాలు

80 లక్షల బ్రిటిష్ కార్మికుల సంఘటిత సంస్థఅయిన బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, 8 లక్షల ఆస్ట్రేలియా కార్మికుల సంఘటిత స్వరూపమైన ఆస్ట్రేలియన్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, ఇటీవల జరిపిన సమావేశాలను అభినందిస్తూ ఈ సమావేశం ఒక తీర్మానం చేసింది.

"కాంగ్రెసు నాయకులను, ఇతర ఫాసిస్టు ప్రతికూల ఖైదీలను విడుదలచేసి, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించి, భారత జాతీయ ప్రతిష్టంభనను తొలగించాలని ఈ సమావేశాలు తీర్మానించాయి.

"ఈవిధంగా బ్రిటిష్, ఆస్ట్రేలియా కార్మిక సోదరులు భారత ప్రజలతో తమ ఏకీభవాన్ని ప్రకటించారు. ఈ కార్మిక సోదరులలో కలిగిన సంతోషకరమైన చైతన్యానికి ఇది సూచన అని అఖిల భారత ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అభినందిస్తూంది. ఆదేశాల్లోని పాలకవర్గాలూ, కొంతమంది కార్మిక నాయకులూ అవలంబిస్తున్న అభివృద్ధి నిరోధక పంథాలకు ఈ చైతన్యం ఒక పెద్ద పెట్టుఅని గుర్తిస్తున్నాము.

"భారత సమస్యాపరిష్కారానికి, ఈదేశాల కార్మిక సోదరులు తమ కృషిని ఇంకా హెచ్చించి, కోట్లకొలది తమ సోదర ప్రజలలో చైతన్యంకలిగించి, తమ ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాము."

ఈవిధంగా కలకత్తా సమావేశం భారత కార్మికవర్గ ఐక్యతను సుస్థిరం చేయడమే కాకుండా, బ్రిటిష్, ఆస్ట్రేలియా కార్మికవర్గాలతో ఐక్యతనుకూడా ప్రకటించింది. ఈ జాతీయ, అంతర్జాతీయ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి తామువేసిన పన్నాగాలన్నీ భగ్నం కావడంతో కాంగ్రెసు సోషలిస్టులు, వారి బంటులు కాలు కాలిన కోతుల్లాగా గంతులు వేశారు. ప్రతిద్వంది సంస్థలనుపెట్టి, ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును విచ్ఛిన్నం చేస్తామని బెదిరిస్తున్నారు. కాని, సంఘటిత కార్మికవర్గం ఈజాతీయ విద్రోహులకింకా తగిన గుణపాఠాలను నేర్పగలదు.

పుస్తక పరిచయం

చైనాలో నూతన జీవితోద్యమం

రచన: జనరలిస్సిమొ జంగ్-కై-షేక్
ఆంధ్రీకరణం: శశి
ప్రచురణ: సంస్కృతి గ్రంథమండలి మద్రాసు.
22 పేజీలు: వెల 0—4—0.

జంగ్-కై-షేక్ తనమిలిటరీప్రభుత్వాన్ని బలపరచుకొనుటకు, కమ్యూనిస్టుఉద్యమాన్ని అరికట్టుటకు, 1934 లో 'నూతన జీవితోద్యమం' అంటూ ఒకటి ప్రారంభించాడు. మర్యాద, న్యాయబుద్ధి, నీతి, మనస్సాక్షి- అను నాలుగు సూత్రాలు యీ ఉద్యమానికి పునాదులు. సన్‌యేట్‌సేన్ సతి (జంగ్-కై-షేక్ సతికి అక్కగారు) చెప్పినట్లు, ఇది వట్టి డాబు, దర్పాలతో కూడుకున్న ఉద్యమం.

"మన దేశం దేశద్రోహులను, కమ్యూనిస్టులను, లంచగొండ్లయిన అధికారులను, కలిగియున్నదను సత్యం మనంకూడా యీ నీతుల నాచరించక నిర్లక్ష్యంగా ఉన్నామని ఋజువు చేస్తుంది." అని జంగ్-కై-షేక్ వ్రాశాడు. కమ్యూనిస్టుల్ని దేశద్రోహులతోను, లంచగొండ్లతోను, జతచేశాడంటే, జపాన్ వ్యతిరేక పోరాటంలో ఆరితేరిన ఒక రాజకీయ పార్టీపై కత్తికట్టి, ప్రజా ఐక్యతను అతడు మొదట ఎలా విచ్ఛిన్న మొనర్చుటకు పూనుకున్నాడోస్పష్టమౌతుంది. అంతేకాదు, జర్మనీ, ఇటలీ, దేశాలలోవలె చైనాలోకూడా ప్రజలు ఎక్కువ కష్టపడి పనిచేయాలనీ, తక్కువ ఖర్చు చేయాలనీ, నీతిబోధ చేస్తున్నాడు. ఇది చదువరులలో అనేక అపోహలు కలిగించడాని కవకాశం ఉంది.

కమ్యూనిస్టులకూ - జాతీయ ప్రభుత్వానికి మధ్య అంతర్యుద్ధం చెలరేగుతూ, జపాన్ వ్యతిరేక ప్రజా ఐక్యతలేని రోజుల్లో యీ ఉద్యమం స్థాపించబడింది. అప్పట్లో జంగ్-కై-షేక్ జపాన్‌తోకంటె కమ్యూనిస్టులతోనే పోరాటం ముఖ్యమని యెంచి, మంచూరియా మొదలైన రాష్ట్రాలను ఫాసిస్టు రాక్షసుల చేతులోపెట్టాడు. నేడు పరిస్థితులు మారాయి. కమ్యూనిస్టులు - ప్రభుత్వం కలసి జపాన్‌తో హోరాహోరిగా పోరాడుతున్నారు. ఉభయపక్షాల తరపున చైనా ప్రజలు తమ దేశరక్షణార్థం ఐక్యతతో ఎన్నో త్యాగాలు చేస్తున్నారు. ఇలా టప్పుడు, ఐక్యతకు భంగం కలిగించే పుస్తకాలను ప్రచురించడంలో అర్థంలేదు.

నాలుగు నెలల అనైక్యతకు స్వస్తి

బెంగాల్ కార్మికుల ఐక్యసంఘటన

బెంగాల్ రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ సమావేశం కలకత్తాలో, గత మాసం 25, 26 తేదీలలో జరిగింది. 81 కార్మిక సంస్థలలో సంఘటితమైన ఒక లక్షమంది కార్మికుల తరఫున 350 మంది ప్రతినిధులు దీనికి వచ్చారు.

ఇది బెంగాల్ కార్మికోద్యమ చరిత్రలో ప్రధానమైన ఘటన. రాష్ట్ర సమావేశం జరప దానికి కావలసిన ఐక్యత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కమిటీలో ఏర్పడడం బెంగాలులో ఇదే మొదటిసారి.

సరిహద్దులో పొంచిఉన్న జపాను దండయాత్ర ప్రమాదం; రాష్ట్ర ప్రజల ప్రాణాలను తోడేస్తున్న కరువు సమస్య; దానివిషయంలో ప్రభుత్వ వర్గం చూపుతూన్న అసమర్థత; "అన్నమో రామచంద్రా" అనే ఆర్తనాదంతో వేలకొలది ప్రజలు ప్రాణాలు విడిచి రాలిపోతూంటే, పార్టీ పంతాలు చెల్లించుకోడానికి బెంగాలు బూర్జువా పార్టీల తగువులాటలు- వీటినన్నిటిని చూచి, బెంగాల్ కార్మికవర్గం సహించలేకపోయింది. తమలో తమకున్న విభేదాలను తొలగించుకొని, సుస్థిరమైన ఐక్యతను నిర్మించుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ నడిపిన వివిధ ఉద్యమాలు ఈ ఐక్యత యొక్క అవసరాన్ని గుర్తింప జేశాయి.

ఆహారం, రాజకీయ ప్రతిష్టంభన, లక్షల కొలది కార్మికులను పీడిస్తున్న నిరుద్యోగ సమస్య- ఇవన్నీ సమావేశాన్నెదుర్కొన్నాయి. సుస్థిర ఐకమత్య బలంతో సమావేశం వీటన్నిటికీ పరిష్కారమార్గంచూపింది.

మే - సెప్టెంబరు

మేనెలలో అఖిలభారత ట్రేడ్‌యూనియన్ సమావేశం నాగపూరులో జరిగింది. ఆసమావేశంలో రాజకీయ తీర్మానంపై ఏకాభిప్రాయం కుదరలేదు; కాంగ్రెసు-లీగ్ ఐక్యతకు జాతుల స్వయంనిర్ణయహక్కును అంగీకరచడమే మూలసూత్రమను విషయాన్ని అంగీకరించలేదు; సోవియట్‌యూనియన్‌తో చేతులుకలిపి ఫాసిజాన్నెదిరించడానికి, ఈ యుద్ధం మనదిగా భావించి మన దేశరక్షణకు పూనుకోడానికి, అంగీకరించలేదు. దేశరక్షణకోసం, ప్రజల క్షేమంకోసం, కార్మికులు అధికోత్పత్తిని సాగించాలన్నే నినాదమివ్వడానికి నాగపూరు సమావేశం అంగీకరించలేదు.

అయితే, దేశపరిస్థితులు నానాటికి మార్పుచెందాయి.

ఈలోగా కలకత్తా ఫాసిస్టుల రాక్షసత్వాన్ని రుచిచూచింది. కరువు రాకాసి వేలకొలది బెంగాల్ ప్రజల్ని పొట్టబెట్టుకుంది. దురాశాపరుల పన్నాగాల ఫలితంగా పరిశ్రమల్లో కలిగిన అవకతవకలు దేశంలోని పరిస్థితులను మరింత బీభత్సం చేశాయి.

నాగపూర్ సమావేశంలోని లోపాల ఫలితాన్ని బెంగాల్ కార్మికులు స్వానుభవం మీద తెలుసుకున్నారు. రాష్ట్రసమావేశంలో వీటినన్నిటిని ఏకదీక్షతో సవరించుకున్నారు. దురాశాపరులను అణగద్రొక్కి, దేశాన్ని కాపాడాలంటే అధికోత్పత్తే మార్గమని సందేశమిచ్చారు. కాంగ్రెసు-లీగ్ ఒడంబడికకు జాతుల స్వయంనిర్ణయహక్కును అంగీకరించాలన్నారు. నాలుగు నెలల్లో తమలో కలిగిన చైతన్యాన్ని, అభివృద్ధిని కలకత్తాలో వెల్లడిచేశారు.

స్కామలెన్స్క విజయం

పంచమాంగదళానికి ముఖ్యకేంద్రమయిన కలకత్తాలో ఇది జరగడం గమనించదగిన విషయం. విచ్ఛిన్నకులు కార్మికవర్గాన్ని ఇంత కాలం చీలదీసి ఉంచగలిగింది ఇక్కడే.

రాష్ట్రసమావేశం ప్రారంభంలో అభిప్రాయ భేదాలు లేకపోలేదు. కాంగ్రెసు సోషలిస్టులు తమ పన్నాగాలను యిక్కడగూడా సాగించబోయారు.

అప్పుడే అమోఘమైన ఒక విజయవార్త చేరింది. స్మాలెన్స్క రెడార్మీ వశమయింది. ఈ వార్త వినగానే సమావేశంలోని ప్రతినిధులు ఆనందపరవశులయారు. ఒకరినొకరు కౌగలించుకున్నారు—పాడారు—ఆడారు- ఆనందాశ్రువులు రాల్చారు.

రక్తమోడ్చి ప్రపంచప్రజావిముక్తిని సాధిస్తున్న సోషలిస్టురాజ్యానికి అండగా నిలవడం తమధర్మమని బెంగాల్‌కార్మికులు ఆక్షణంలో గుర్తించారు. అందరూ ఐక్యతతో దేశరక్షణ కార్య క్రమానికి తోడ్పడ నిశ్చయించారు.

అనైక్యత అంతరించి, ఐక్యసంఘటన ఏర్పడింది.

దేశరక్షణకు, కరువునివారణకు, జాతీయ ఐక్యతనునిర్మించుటకు, జాతీయప్రభుత్వ సాధనకు—లక్షమంది బెంగాల్ కార్మికులు నిండు ఆత్మవిశ్వాసంతో నడుం బిగించి ముందుకు సాగుతున్నారు.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE